Follow: @ANNTELUGU
28-10-2025
# మహా పత్రిక
ANN తెలుగు
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 322 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్



## బీఆర్ఎస్ ఐదు ముక్కలు

- మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు
- కేటీఆర్ జాగ్రత్తగా ఉండాలని కవితే సూచిస్తున్నారు

02



గెలిస్తే అనుమానం వస్తుందని
## బీహార్‌లో బీజేపీ గెలవదు

- బీజేపీ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీని గెలిపిస్తుందన్న పాల్
- ఈవీఎం ఉన్నంత వరకు బీజేపీయే అధికారంలో ఉంటుందని వ్యాఖ్య

02



## ఏపీలో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు

- సన్నాహాలు షురూ.. జనవరిలో నోటిఫికేషన్

02

# 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్

## రెండోదశ ప్రకటించిన సీఈసీ జ్ఞానేష్ కుమార్

### యూపీ, బెంగాల్, రాజస్థాన్, కేరళ, తమిళనాడు, ఎంపీ, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో అమలు

**ఢిల్లీ, మహా:** దేశంలో రెండో విడత సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎస్ ఐఆర్ ను మంగళవారం నుంచి చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మొత్తం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రెండో విడత ఎస్ ఐ ఆర్ చేపడతామని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం నుంచి ఉత్తర్‌ప్రదేశ్, బెంగాల్, రాజస్థాన్, కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, పుదుచ్చేరి, అండమాన్, లక్షద్వీప్‌లో ఎస్ ఐ ఆర్ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

మిగతా 2లో






# ఏపీ మరో సిక్సర్

## కొత్తగా.. ఆరు జిల్లాలు

- జిల్లాల పునర్విభజనపై నేడు సీఎంతో క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ
- అమరావతి, మార్కాపురం, రంపచోడవరం, పలాస, గూడూరు, మదనపల్లి కేంద్రాలుగా కొత్త జిల్లాలు
- 10 కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు కూడా సిఫార్సులు
- నవంబర్ 7న ఆమోదం.. జనవరి 1 నుండి అమలుకు ప్లాన్

**అమరావతి-మహా:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల మార్పుపై ప్రభుత్వ కసరత్తు తుది దశకు చేరుకుంది. జిల్లాల పునర్విభజనకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వినతులు, ప్రతిపాదనలపై ముఖ్యమంత్రితో చర్చించి, ఆయన సూచనల మేరకు తుది నివేదికను రూపొందించనుంది. ఈ నివేదికను నవంబర్ 7న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆమోదించే అవకాశాలు ఉన్నాయి. పరిపాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్షల మేరకు జిల్లాల సరిహద్దులు, పేర్ల మార్పు కోసం ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీకి రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నుంచి దాదాపు 200 వరకు అర్జీలు అందాయి. వీటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన ఉపసంఘం, జిల్లా అధికారుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంది. జనగణన ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో డిసెంబర్ 31వ తేదీలోగా ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

వివరాలు 2లో

### ఇవే కొత్త జిల్లాలు

1. అమరావతి
2. మార్కాపురం
3. రంపచోడవరం
4. పలాస
5. గూడూరు
6. మదనపల్లె



ఆ మంత్రిని వెంటనే కేబినెట్ నుంచి
## తొలగించండి
### సీఎం రేవంత్‌కు బండి సంజయ్ విజ్ఞప్తి

**కరీంనగర్, మహా :** తెలంగాణ కేబినెట్ లోని కొందరు మంత్రులు మహిళా అధికారులను ఇంటికి పిలిపించుకుని ఇబ్బంది పెడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తక్షణమే ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారణ జరిపి నివేదిక తెప్పించుకోవాలని కోరారు.


మిగతా 2లో

# దూసుకొచ్చిన.. మొంథా తుఫాన్

## తెలుగు రాష్ట్రాలపై ప్రళయ ప్రభావం తీవ్రం

### గంటకు 100 నుండి 110 కి.మీ. వేగంగా గాలులు

- ఏపీకి పెనుముప్పు.. చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్
- అలర్ట్ చేసిన కేంద్రం .. నేడు విజయవాడలో 16 సెంమీ వర్షం కురిసే ఛాన్స్
- తెలంగాణపైనా ఎఫెక్ట్.. రాష్ట్రవ్యాప్తంగా భారీవర్షాలు
- నేడు, రేపు ఆంధ్రాకు ప్రయాణాలు పెట్టుకోకండి
- ఏపీకి ఏకంగా 43రైళ్ళు రద్దు .. పరిస్థితిపై తెలంగాణ సర్కారు అలర్ట్



**హైదరాబాద్, అమరావతి, మహా :** బంగాళాఖాతంలో మరోసారి ప్రకృతి ప్రళయం ఉధృతం కానుంది. 'మొంథా' తుపాను ఈ సారి ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాలను బలంగా తాకబోతోంది. వాతావరణశాఖ తాజా నివేదికల ప్రకారం, బంగాళాఖాతంలోని అల్పపీడనం క్రమంగా బలపడుతూ తీవ్ర వాయుగుండంగా మారి,

మిగతా 2లో

## తెలంగాణలో ముగిసిన మద్యం షాపుల డ్రా

### రాష్ట్ర వ్యాప్తంగా 2620 షాపులకు డ్రా...

- వైన్స్ టెండర్లలో సంగారెడ్డి యువకుడి హ్యాట్రిక్
- ఖజానాకు కాసుల గలగల



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో మద్యం షాపుల డ్రా ప్రక్రియ ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2620 షాపులకు సోమవారం అధికారులు, కలెక్టర్ల సమక్షంలో ఎక్సైజ్ శాఖ అధికారులు డ్రా తీశారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో 179 మద్యం షాపులకు డ్రా ముగిసింది.

మిగతా 2లో



## జూబ్లీహిల్స్‌లో పోటీ మజ్లిస్- భాజపా మధ్యే

### బీజేపీ చీఫ్ రామచందర్‌రావు

**హైదరాబాద్, మహా :** రాబోయే రోజుల్లో బీజేపీ విజయానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నాంది కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉప ఎన్నికపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. "జూబ్లీహిల్స్‌లో మజ్లిస్-బీజేపీమధ్యే పోటీ ఉంటుంది. ప్రజలు బీజేపీకి ఓటేయకుంటే మజ్లిస్ సీట్లు 8 అవుతాయి. ఆ పార్టీని ఆపాలంటే బీజేపీని గెలిపించాలి. జూబ్లీహిల్స్‌కు కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి చేసిందేమీ లేదు. బీజేపీని గెలిపించాలనే ఆలోచనలో ప్రజలు ఉన్నారు" అని రామచందర్‌రావు అన్నారు.

## రైతులకు నష్టం జరగకుండా చూడండి

### తుఫాన్ నేపథ్యంలో సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్, మహా :** తెలంగాణకు వర్ష సూచన దృష్ట్యా రైతులకు నష్టం కలగకుండా పంటలు కొనుగోలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఎం ఆదేశాలతో కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,25,620 |
| 22 క్యారెట్ | 1,15,150 |
| సిల్వర్ (కేజీ) | 1,55,000 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 84,211.88 |
| నిఫ్టీ | 25,795.15 |

## ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో.. ఎఎన్ఎన్ జర్నలిస్టు విజయం

### ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా విజయం సాధించిన అశోక్

అభినందించిన జర్నలిస్టులు



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో ఎఎన్ఎన్ సినిమా బ్యూరో రిపోర్టర్, సీనియర్ జర్నలిస్ట్ అశోక్ దయ్యాల సంచలన విజయం సాధించారు. 336 ఓట్లు సాధించి.. అనూహ్య విక్టరీ అందుకున్నారు. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో అశోక్ సంచలన విజయం సాధించడంతో ఎఎన్ఎన్ యాజమాన్యం, సీనియర్ జర్నలిస్టులు అభినందించారు. తీవ్ర పోటీ ఉన్న సందర్భంలోనూ ఎఎన్ఎన్ తెలుగు జర్నలిస్ట్ గా బరిలో నిలిచి, స్నేహితులు, సహచరుల మద్దతుతో మంచి విజయం సాధించడంపై ఎఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డి అభినందించారు. అశోక్ భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అశోక్ ను ఎఎన్ఎన్ కార్యాలయంలో శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జీఎం అరవింద్ రెడ్డి, అజయ్, రాంప్రసాద్, క్రాంతికుమార్, భాగ్యరాజ్, వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో నేడు కమలం ప్రచార దండయాత్ర

- కార్పెట్ బాంబింగ్ పేరుతో అగ్రనేతలంతా రంగంలోకి
- ఒకేసారి 40మంది స్టార్ క్యాంపెయినర్లు.. సీఎంలు, ఎంపీలు

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ సంచలన ప్రచారానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ రాజకీయాల్లో మొదటిసారిగా మంగళవారం కార్పెట్ బాంబింగ్ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా పార్టీ స్టార్ క్యాంపెయినర్స్, రాజస్థాన్ ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్, శాసన సభ, శాసన మండలి సభ్యులు, ఇతర ముఖ్య నాయకులంతా ఒకేసారి నియోజకవర్గాన్ని చుట్టుముట్టనున్నారు.

మిగతా 2లో

## కంగనా క్షమాపణ

### అయినా సుప్రీంకోర్టులో షాక్

వివరాలు 2లో



# ఏపీ మరో సిక్సర్


## కొత్తగా.. ఆరు జిల్లాలు

**జిల్లాల పునర్విభజనపై నేడు సీఎంతో క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ**

**అమరావతి, మార్కాపురం, రంపచోడవరం, పలాస, గూడూరు, మదనపల్లి కేంద్రాలుగా కొత్త జిల్లాలు**

**10 కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు కూడా సిఫార్సులు**

**నవంబర్ 7న ఆమోదం.. జనవరి 1 నుండి అమలుకు ప్లాన్**



(మొదటిపేజీ తరువాయి)

వైసీపీ హయాంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించారు. జిల్లాల విభజన, పెంపు జరిగిన నాటి నుంచి అనేక వివాదాలు, అసంతృప్తులు ప్రజలు, రాజకీయ పక్షాల నుంచి నాడు వెల్లువెత్తాయి. ప్రజల అభిప్రాయాలను సమగ్రంగా సేకరించకుండానే గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గందరగోళానికి దారి తీసిందని పేర్కొంటూ ఈ గందరగోళానికి తెరదించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు, ప్రజలు, రాజకీయ నేతల విజ్ఞప్తుల నేపథ్యంలో 26 జిల్లాలను 32 జిల్లాలు చేసేందుకు ప్రభుత్వం యోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఆరు కొత్త జిల్లాల ఏర్పాటుపై ఉపసంఘం ముఖ్యమంత్రికి నివేదించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు ఉపసంఘం సానుకూలంగా ఉన్నట్టు సమాచారం. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాలతో ఈ జిల్లాను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. అమరావతి కేంద్రంగా పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాలతో మరో కొత్త జిల్లా ఏర్పాటు ప్రతిపాదన కూడా ఉంది. సచివాలయం, అసెంబ్లీ ఇక్కడే ఉండటం, భవిష్యత్తులో పరిపాలనా కార్యకలాపాలు, ప్రోటోకాల్ విధులు పెరగనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. ఏజెన్సీ ప్రాంతంలో రంపచోడవరం, చింతూరు డివిజన్లతో పాటు నాలుగు విలీన మండలాలతో రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై కూడా సీఎం వద్ద చర్చ జరగనుంది. రంపచోడవరం నుంచి జిల్లా కేంద్రమైన పాడేరు 187 కి.మీ. దూరంలో ఉండటంతో ఈ ప్రతిపాదనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం నియోజకవర్గాలతో పలాస కేంద్రంగా కొత్త జిల్లా ప్రతిపాదనలో ఉంది. ఇక గూడూరు, వెంకటగిరి, సర్వేపల్లి, సూళ్లూరుపేట నియోజకవర్గాలతో కలిపి గూడూరు జిల్లా కేంద్రంగా కొత్త జిల్లా ప్రతిపాదనలో ఉంది. మదనపల్లి, పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లి నియోజకవర్గాలతో మదనపల్లి కేంద్రంగా మరో కొత్త జిల్లా ఏర్పాటుకు ఉప సంఘం ప్రతిపాదించినట్లు సమాచారం.

**కొత్త డివిజన్లు, మండలాల ఏర్పాటు**

కొత్త జిల్లాలతో పాటు అద్దంకి, మడకశిర సహా 10 కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఒక నియోజకవర్గం రెండు, మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉండటంతో తలెత్తుతున్న పరిపాలనా ఇబ్బందులను తొలగించేందుకు ఒకే నియోజకవర్గ పరిధిలోకి తెచ్చేలా మార్పులు చేయనున్నారు. ఆదోని వంటి పెద్ద మండలాలను విభజించాలనే వినతులపై కూడా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని అశాస్త్రీయ విభజనలను సరిదిద్దే అంశంపైనా దృష్టి సారించారు. కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కొనసాగించాలా లేక ప్రకాశం జిల్లాలో కలపాలా అనే అంశంపై కూడా ఈ భేటీలో స్పష్టత రానుంది.



# బీఆర్ఎస్ ఐదు ముక్కలు

**మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**కేటీఆర్ జాగ్రత్తగా ఉండాలని కవితే సూచిస్తున్నారు**

**జూబ్లీహిల్స్, మహా :** కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్ రావు, సంతోష్ రావు దోచుకున్నారని, కేటీఆర్ జాగ్రత్తగా ఉండాలని స్వయంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి అంశంలో... రామన్నా జాగ్రత్త" అని కవితనే హెచ్చరించారని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ ఐదు ముక్కలైందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన స్థాయికి తగిన వ్యక్తి కాదని విమర్శించారు. తాను మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ఆయన గుంటూరులో ఇంకా చదువుకుంటున్నాడని వ్యాఖ్యానించారు. పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన చేయని కేటీఆర్ గురించి మాట్లాడటం అనవసరమని అన్నారు.

# జూబ్లీహిల్స్‌లో నేడు కమలం ప్రచార దండయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

ప్రచార దండయాత్ర చేపట్టనున్నారు. ప్రచార కార్యక్రమాలతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గంలో గల్లీగల్లీ బీజేపీ నేతలతో కిక్కిరిసిపోవాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ప్రచారంలో వెనుకబడ్డారన్న ఆరోపణలను పటాపంచలు చేయాలని భావిస్తోంది. ఎన్నికల ప్రచారం ముగిసే వరకు నేతలంతా జూబ్లీహిల్స్ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆదేశించింది. కుండపోత వర్షానికి క్లౌబ్ బరెస్ట్ అన్నట్లు రాజకీయాల్లో ఒక్కసారిగా అలాంటి ప్రభావంతమైన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టడాన్ని కార్పెట్ బాంబింగ్ అంటారు. ఇది ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రాచుర్యంలో ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి అని బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో స్టార్ క్యాంపెయినర్స్ 40 మందితో పాటు రాష్ట్ర నేతలందరూ ప్రచారంలో పాల్గొననున్నారు. బీజేపీ నేతలతో నియోకవర్గ వీధులన్నీ కిక్కిరిసిపోవడం ఖాయమని నేతలు పేర్కొంటున్నారు. దీని ప్రభావం అభ్యర్థి దీపక్ రెడ్డికి ఎలా కలిసొస్తుందో చూడాలి.



# గెలిస్తే అనుమానం వస్తుందని బీహార్‌లో బీజేపీ గెలవదు

- బీజేపీ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీని గెలిపిస్తుందన్న పాల్
- ఈవీఎం ఉన్నంత వరకు బీజేపీయే అధికారంలో ఉంటుందని వ్యాఖ్య

**ఢిల్లీ, మహా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవదని, ఆ పార్టీయే ఆర్జేడీని గెలిపిస్తుందని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో అసలైన ఓట్లను తొలగించి, లేని ఓట్లను చేర్చారని ఆరోపించారు. దేశంలో ఈవీఎం ద్వారా ఓటింగ్ ఉన్నంత వరకు బీజేపీ అధికారంలో ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. బీహార్‌లో బీజేపీ గెలిస్తే దేశ ప్రజలకు అనుమానం వస్తుందనే ఆలోచనతో అక్కడ ఆర్జేడీని గెలిపిస్తారని ఆయన జోస్యం చెప్పారు. ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే జరగాలని ఆయన డిమాండ్ చేశారు. బ్యాలెట్ విధానం కోసం తన పార్టీ పోరాడుతోందని కేఏ పాల్ పేర్కొన్నారు.

# కంగనా క్షమాపణ

## అయినా సుప్రీం కోర్టులో షాక్

**ఢిల్లీ, మహా:** 202021లో ఢిల్లీలో రైతుల నిరసనలపై బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యవహారంలో ఆమె క్షమాపణలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు దేశ రాజధానిలో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. ఆ సమయంలో మహీందర్ కౌర్ అనే 73 ఏళ్ల మహిళపై కంగన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ కేసు విచారణ నిమిత్తం కంగనా రనౌత్ సోమవారం కోర్టుకు హాజరయ్యారు. ఆనాటి పోస్టుకు ఆమె క్షమాపణ కోరారు. తాను కావాలని ఆ వ్యాఖ్యలు చేయలేదని, జరిగినందుకు చింతిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. తనపై నమోదైన పరువు నష్టం కేసును కొట్టివేయాలంటూ కంగన సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది.

# ఆ మంత్రిని వెంటనే కేబినెట్ నుంచి తొలగించండి

## సీఎం రేవంత్‌కు బండి సంజయ్ విజ్ఞప్తి

(మొదటిపేజీ తరువాయి)

అలాంటి మంత్రులను కేబినెట్ నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎంఐఎంకు చెందిన రౌడీషీటర్లు పోలీసులను చంపినా, హత్యాయత్నం చేసే స్థాయికి పెట్రేగిపోతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందన్నారు. జూబ్లీహిల్స్‌లో ఒకవర్గం ఓట్ల కోసం ఎంఐఎం కాళ్లు పట్టుకునే స్థాయికి కాంగ్రెస్ పార్టీ దిగజారిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోకి రావాలంటే యూపీ తరహాలో రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. సర్దార్ వల్లభాయి పటేల్ 150 జయంతి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో సోమవారం కరీంనగర్‌లోని మేరా యువ భారత్ కార్యాలయంలో మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కరీంనగర్, సిరిసిల్ల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర కేబినెట్‌లోని కొందరు మంత్రులు మహిళా అధికారులను రాత్రి పూట ఇండ్లకు, ఆఫీసులకు పిలిపించుకుని వేధిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. కష్టపడి చదువుకుని ఉద్యోగాల్లో చేరి విధులు నిర్వహిస్తున్న మహిళలను గౌరవించాల్సింది పోయి అవమానించేలా వ్యవహరించడం సరికాదు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే విచారణ జరిపించి నివేదిక తెప్పించుకోవాలి. బాధ్యులైన మంత్రులను బర్త్ రఫ్ చేయాలి. ఇప్పటికే కాంగ్రెస్ పాలన అంటేనే మహిళలు అసహ్యించుకునే పరిస్థితి ఉంది. అవినీతి, అరాచకాలు జరుగుతున్నాయి. ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేశారు. ముఖ్యంగా మహిళలకు ప్రతినెలా రూ.2500లు, తులం బంగారం, స్కూటీ ఇస్తానని మోసం చేశారు. వీటికి తోడు శాంతి భద్రతలు అదుపు తప్పుతున్నాయి. సాక్షాత్తు పోలీసులపై దాడులు చేస్తున్నరు. మొన్న నిజామాబాద్‌లో మజ్లిస్ రౌడీషీటర్ కానిస్టేబుల్‌ను చంపేశారు. నిన్న హైదరాబాద్ నడిబొడ్డున డీసీపీ చైతన్య, కానిస్టేబుల్‌పై ఎంఐఎం రౌడీషీటర్ దాడి చేసి హత్యాయత్నం చేసినా దిక్కు లేదు. గోరక్షులపై కాల్పులు జరిపి చంపేందుకు యత్నిస్తున్నారు. మేం బాధితులకు అండగా వెళ్లి పోలీసులను పరామర్శిస్తే.. మజ్లిస్ నేతలు మాత్రం రౌడీషీటర్లను పరామర్శిస్తూ వారికి కొమ్ము కాస్తున్నారు. ఎంఐఎం ఓట్ల కోసం జూబ్లీహిల్స్‌లో గెలవడానికి ఆ పార్టీ కాళ్లు మొక్కుతున్నారు. ఆనాడు బీఆర్ఎస్ కూడా ఎన్నికల్లో గెలిచేందుకు కాళ్లు మొక్కిన దుస్థితి. ఈ రెండు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడల్లా ఎంఐఎంను పెంచి పోషిస్తున్నాయే శాంతి భద్రతలు పట్టడం లేదు. అందుకే ఆ పార్టీల కోసం ఒవైసీ బిహార్‌ను వదిలి జూబ్లీహిల్స్‌లో తిష్టవేసి ముస్లిం ఓట్ల కోసం ప్రచారం చేస్తున్నారు. అని సంజయ్ మండిపడ్డారు.

**ఓట్ల రాజకీయం**

కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల రాజకీయం మానుకోవాలని బండి సంజయ్ హితవు పలికారు. డీసీపీ చైతన్యపై హత్యాయత్నం చేసిన రౌడీషీటర్‌పై కఠినాతి కఠినంగా చర్యలు తీసుకోవాలి. యూపీ ప్రభుత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలి. అక్కడ రౌడీషీటర్లకు బెయిల్ వచ్చినా బయటకు రాకుండా జైల్లోనే ఉండే పరిస్థితి. అట్లాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటే తప్ప రౌడీషీటర్లను కంట్రోల్ చేయాలని అన్నారు.

# ఏపీలో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు

**సన్నాహాలు షురూ..**

**జనవరిలో నోటిఫికేషన్**

**అమరావతి, మహా :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. జోరుమీదున్న కూటమి సర్కార్ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, మున్సిపాలిటీలకు త్వరత్వరగా ఎన్నికలు జరిపి.. స్థానికసంస్థలపై పూర్తి పట్టు బిగించాలని, పార్టీలో ఉత్సాహం తీసుకురావాలని భావిస్తోంది. ఈ ఎన్నికలను నాలుగు దశలలో నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఇటీవల ఏపీ రాష్ట్ర ఎన్నికల అధికారి నీలం సాహ్ని చెప్పారు. అయితే డిసెంబర్ చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశమై, జనవరిలో నోటిఫికేషన్ జారీ చేసి అదే నెలలో ఫలితాలు ప్రకటించాలని ఎస్ ఈ సీ చేస్తున్నట్లు తెలుస్తోంది. 18 ఏళ్లు నిండిన వారికి ఏడాదిలో నాలుగు సార్లు ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించేలా చట్ట సవరణ కోసం ప్రభుత్వానికి సూచించామని నీలం సాహ్ని తెలిపారు. ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని టీడీపీ శ్రేణులకు అధినేత చంద్రబాబు ఇప్పటికే సంకేతాలు పంపారు. కూటమిగా ఉన్నా.. స్థానికంగా మంచి ఫలితాలు తీసుకురావాలని మంత్రులకు చంద్రబాబు టార్గెట్లు విధించనున్నారు.

# తెలంగాణలో ముగిసిన మద్యం షాపుల డ్రా

## రాష్ట్ర వ్యాప్తంగా 2620 షాపులకు డ్రా...

**వైన్స్ టెండర్లలో సంగారెడ్డి యువకుడి హ్యాట్రిక్**

**ఖజానాకు కాసుల గలగల**

(మొదటిపేజీ తరువాయి)

డిసెంబర్ 1వ తేదీ నుంచి తెలంగాణ వ్యాప్తంగా కొత్త వైన్స్ షాపుల నిర్వహణ కొనసాగనుంది. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో మద్యం షాపులు దక్కించుకునేందుకు ఎక్కువమంది సిండికేటై టెండర్లు వేశారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంపై నెగిటివ్ ప్రచారం జరుగుతుండడంతో యువకులు, వ్యాపారులు మద్యం వ్యాపారంపై ఎక్కువగా కన్నేశారు. పలుచోట్ల గ్రూపుగా ఏర్పడి ఎక్కవగా దరఖాస్తులు వేశారు. గ్రూపుగా కావడంతో పాటు ఫీజు పెంపు కారణంగా దరఖాస్తులు తగ్గినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఒక్కో దరఖాస్తుకు ప్రభుత్వం రూ.3లక్షలు ఫీజు పెట్టిన విషయం తెలిసిందే. ఎంపికైన దరఖాస్తుదారులు అదే రోజు గానీ, మరుసటి రోజు గానీ షాప్ ఎక్సైజ్ పన్ను మొదటి వాయిదాను చెల్లించి షాపు కేటాయింపు నిర్ధారణ లేఖ తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

**హ్యాట్రిక్ కొట్టిన సంగారెడ్డి రాజేశ్వర్ గౌడ్**

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వైన్స్ టెండర్ల లక్కీ లాటరీలో సంగారెడ్డికి చెందిన వ్యక్తికి అదృష్టం వరించింది. ఒక్కడికే 3 వైన్ షాపులు దక్కి హ్యాట్రిక్ కొట్టాడు. సంగారెడ్డి పట్టణానికి చెందిన రాజేశ్వర్ గౌడ్ సిండికేట్‌గా సంగారెడ్డి పట్టణంలోని మొత్తం 24 షాపులకు టెండర్లు వేశారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో సంగారెడ్డి జెఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఎక్సైజ్ శాఖ లక్కీ లాటరీలో రాజేశ్వర్ గౌడ్‌కి షాప్ నెంబర్ 1, 3, 8 లాటరీ ద్వారా దక్కాయి. అయితే వీరంతా సిండికేట్‌గా సంగారెడ్డిలోని అన్ని షాపులకు కలిపి దాదాపు 100 వరకు దరఖాస్తులు చేసుకున్నారు. అందులో ఏకంగా మూడు షాపులు రాజేశ్వర్‌కి దక్కడంతో అతను సంతోషంతో ఉబ్బితబ్బిపోయాడు.

# 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్

## రెండోదశ ప్రకటించిన సీఈసీ జ్ఞానేష్ కుమార్

**యూపీ, బెంగాల్, రాజస్థాన్, కేరళ, తమిళనాడు, ఎంపీ, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో అమలు**

(మొదటిపేజీ తరువాయి)


డిసెంబరు 9న ముసాయిదా ఎస్ ఐ ఆర్ జాబితాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని వివరించారు. దేశంలో ఇప్పటివరకు 8సార్లు సమగ్ర ఓటర్ల జాబితా సవరణ జరిగిందన్న ఆయన, గత 20 ఎళ్ల నుంచి ఇప్పటివరకూ ఒక్కసారి కూడా జరగలేదని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్ ఆవశ్యకతను సీఈసీ వివరించారు.

**12 రాష్ట్రాల్లో 51 కోట్ల మంది ఓటర్లు**

ఈ 12 రాష్ట్రాల్లో ఓటర్లు సుమారు 51 కోట్ల మంది ఉన్నారు. సుమారు 5లక్షల 33వేల పోలింగ్ కేంద్రం స్థాయి అధికారులు ఈ మహా ప్రక్రియలో పాల్గొంటారు. సుమారు 7లక్షల 64 వేల పోలింగ్ కేంద్రం స్థాయి ఏజెంట్లు కూడా ఈ ప్రక్రియలో పాల్గొంటారు. 10వేల 500 మంది ఈఆర్‌వోలు, 321 మంది కలెక్టర్లు కూడా ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొని ఎస్ఐఆర్‌ను విజయవంతం చేస్తారు. పత్రాల ముద్రణ, శిక్షణ కార్యక్రమాలు మంగళవారం నుంచి నవంబర్ 3 వరకు జరుగుతాయి. నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకు ఇంటింటి సర్వే జరుగుతుంది. ముసాయిదా ఓటరు జాబితా ముద్రణ డిసెంబర్ 9న జరుగుతుంది. అభ్యంతరాల స్వీకరణ డిసెంబర్ 9




నుంచి జనవరి 8 వరకూ ఉంటుంది. నోటీసులు అందుకున్న వారి విచారణ, పునర్ పరిశీలన డిసెంబర్ 9 నుంచి జనవరి 21 వరకూ జరుగుతుంది. తుది ఓటరు జాబితా ఫిబ్రవరి 7న ప్రకటిస్తాం. సమగ్ర ఓటర్ల జాబితా సవరణ తుది జాబితా ప్రకటించిన తర్వాత ప్రతి ఒక్కరికీ అప్పీల్ చేసే అవకాశం ఉందని సీఈసీ జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్లే జాబితాలో ఉంటారన్న ఆయన, అనర్హులను తొలగిస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఇంట్లోని ఓటరు వద్దకు B.L.O మూడుసార్లు వెళ్తారన్న సీఈసీ, మరణించినా, వలస వెళ్లినా, ఎక్కువచోట్ల నమోదు చేయించుకున్నా తొలగిస్తామని తేల్చిచెప్పారు. ఓట్లు తొలగించిన వారి పేర్లను స్థానిక కార్యాలయాల్లో ప్రదర్శిస్తామన్న సీఈసీ వృద్ధులు, దివ్యాంగులు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. జాబితాలోని తల్లిదండ్రులు, అడ్రస్ వివరాలను ఓటర్లు సరిచూసుకోవాలని కోరారు.



# దూసుకొచ్చిన.. మొంథా తుఫాన్

(మొదటిపేజీ తరువాయి)

అక్టోబర్ 28 నాటికి పెను తుపానుగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇది విశాఖకు ఆగ్నేయ దిశగా సుమారు 780కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు తెలిపారు. వచ్చే 24గంటల్లో ఇది ఉత్తర-వాయువ్య దిశగా కదిలి, మచిలీపట్నం-కాకినాడ మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ తుపాను భూమిని తాకే సమయానికి గాలివేగం గంటకు 100 నుండి 110 కి.మీ. వరకు ఉండొచ్చని వాతావరణశాఖ హెచ్చరించింది. సముద్రం అత్యంత ఆందోళనకరంగా ఉప్పొంగే అవకాశం ఉండటంతో తీరప్రాంతాల్లో ఉన్న మత్స్యకారులు, ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీరప్రాంత జిల్లాల్లో ఉన్న అధికారులు, రెవెన్యూ యంత్రాంగం, విద్యుత్ శాఖ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బందిని అప్రమత్తం చేసింది. కాకినాడ, తూర్పు గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం, మచిలీపట్నం, గుంటూరు జిల్లాలను అత్యంత ప్రమాద ప్రాంతాలుగా గుర్తించింది. మొంథా ఎఫెక్ట్ తీవ్రంగా ఉండగా, అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ చంద్రబాబుకు ఫోన్ చేశారు. మరోవైపు మంత్రులు కూడా అలర్ట్ అయి ఎక్కడికక్కడ సమీక్షలు జరిపారు.

**తెలంగాణలో అత్యంత భారీ వర్షా లు**

తెలంగాణలో కూడా ఈ తుపాను ప్రభావం తీవ్రంగా కనిపించనుంది. అక్టోబర్ 28, 29 తేదీల్లో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని, కొన్నిచోట్ల 150 నుండి 200 మిల్లీమీటర్ల వరకు అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. తుఫాన్ ప్రభావం నేపథ్యంలో అధికారయంత్రాంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. మంగళ, బుధవారాల్లో ఏపీకి ప్రయాణాలు పెట్టుకోవొద్దని, వర్షాల ప్రభావం చాలా తీవ్రంగా ఉండే అవకాశముందని తెలంగాణ అధికారులు సూచించారు.

**హైదరాబాద్‌కు ఈదురుగాలులు, భారీ వర్షసూచన**

హైదరాబాద్ సహా రాష్ట్ర మధ్య ప్రాంతాల్లో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. గంటకు 40 నుండి 60 కి.మీ. వేగంతో గాలులు వీస్తూ, చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలే ప్రమాదం ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సరఫరా అంతరాయం, రహదారుల్లో నీరు నిలిచిపోవడం, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. మొంథా తుపాను ప్రభావం రానున్న మూడు రోజులపాటు కొనసాగుతుందని, ఆ తర్వాత ఇది ఉత్తర దిశగా పయనిస్తూ, క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. తుపాను తీరానికి దూరంగా ఉన్న రాష్ట్రాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని, ముఖ్యంగా తెలంగాణ, తూర్పు మహారాష్ట్ర ప్రాంతాల్లో విస్తారమైన వర్షాలు కురుస్తాయని తెలిపింది. తుపాను ప్రభావాన్ని తట్టుకోవడానికై ప్రస్తుతానికి ఆంధ్ర-తెలంగాణ ప్రభుత్వాలు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నాయి. తీరప్రాంత గ్రామాల్లో పాఠశాలలు మూసివేయడం, అవసరమైన చోట ఖాళీ చేయించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ప్రజలు అధికారుల సూచనలు పాటించి, తుపాను ప్రభావం ముగిసే వరకు బయటకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని వాతావరణశాఖ సూచించింది.

# ఆటోలో కేటీఆర్

**ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్**



**హైదరాబాద్, మహా:** తెలంగాణలోని ఆరు లక్షలకు పైగా ఆటో డ్రైవర్ల పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌కు సోమవారం ఆయన ఆటోలో వచ్చారు. తాను వచ్చిన మస్రత్ అలీ అనే వ్యక్తి ఆటోలోనే అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ ప్రయాణించినట్లు కేటీఆర్ చెప్పారు. ఆటో డ్రైవర్లకు అన్నీ చేస్తామని రాహుల్ గాంధీ నాడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మస్రత్ అలీ తనకున్న రెండు ఆటోలు అమ్మి.. ఆయన ప్రస్తుతం కిరాయి ఆటో నడుపుతున్నట్లు చెప్పారని కేటీఆర్ వివరించారు. ఆత్మహత్య చేసుకున్న 161మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గులాబీ పార్టీకి భారీగా తగ్గిన విరాళాలు

## 97.4 శాతం ఢమాల్..

**అధికారంలో ఉన్నపుడు రూ.580.52 కోట్లు..**

**గత ఏడాది రూ.15.09 కోట్లే**


**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ పార్టీకి వచ్చే విరాళాలు భారీగా తగ్గిపోయాయి. గులాబీ పార్టీ ప్రతిపక్షంలోకి రాగానే ఆ పార్టీకి వచ్చే విరాళాలు 97.4% తగ్గిపోయినట్టు సమాచారం. ఈసీకి సమ్పరించిన ఆడిట్ ప్రకారం 202425లో కేవలం రూ.15.09 కోట్లు మాత్రమే ఫండ్స్ గా వచ్చినట్టు గులాబీ పార్టీ పేర్కొంది. ప్రోగ్రెసివ్ ఎలక్ట్రోరల్ ట్రస్ట్ నుంచి రూ.10 కోట్లు, ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.5 కోట్ల విరాళాలు మాత్రమే అందినట్టు తెలిపింది. కాగా 2023 24లో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీఆర్ఎస్ పార్టీకి రూ.580.52 కోట్లు రాగా.. ఈసారి అవి ఏకంగా 97.4 శాతానికి పడిపోవడం గమనార్హం. ఈ




విరాళాల అంశంలో బీఆర్ఎస్ ను ప్రత్యర్థిపార్టీలు టార్గెట్ చేస్తున్నాయి.

## వైఎస్సార్ అంతటి గొప్ప వ్యక్తి రేవంత్ రెడ్డి

### మంత్రి కొండా సురేఖ ప్రశంసలు



**హైదరాబాద్, మహా :** మంత్రి కొండా సురేఖ మరోసారి బీఆర్ఎస్ పై ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నాడు రైతులను పట్టించుకోకుండా, వరి వేస్తే ఉరేసుకోవాలని బెదిరించిందని విమర్శించారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతులను ఆదుకున్నట్టు ఇప్పుడు రేవంత్ రెడ్డి మాత్రమే రైతులను ఆదుకుంటున్నాడని ప్రశంసించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేసి, సన్నకారు రైతులకు బోనస్ కూడా అందించినట్లు ఆమె తెలిపారు. ఈ చర్యల వల్ల తెలంగాణ దేశంలోనే అత్యధిక వరి పండించిన రాష్ట్రంగా నిలిచిందని కొండా సురేఖ పేర్కొన్నారు.

# భారత్–చైనా మధ్య అయిదేళ్ల తర్వాత నేరుగా విమానాల రాకపోకలు ప్రారంభం

**న్యూఢిల్లీ:** అయిదేళ్ల అనంతరం భారత్, చైనాల మధ్య నేరుగా విమాన సర్వీసులు అధికారికంగా మొదలయ్యాయి. ఈ విషయాన్ని భారత్‌లో చైనా రాయబార కార్యాలయం ప్రతినిధి యు జింగ్ ఆదివారం ఎక్స్ వేదికగా ధ్రువీకరించారు. మొదటి విమానం కోల్‌కతా నుంచి గ్వాంగ్‌ఝౌకు టేకాఫ్ తీసుకుందన్నారు. నవంబర్ 11వ తేదీ నుంచి తాము కోల్‌కతా-గ్వాంగ్‌ఝౌ ఎయిర్ బస్ సర్వీసును ప్రతిరోజూ నడుపుతామని ఇండిగో ప్రకటించింది. అదేవిధంగా, నవంబర్ 9వ తేదీ నుంచి షాంఘై-న్యూఢిల్లీ మార్గంలో వారానికి మూడు సర్వీసులు రాకపోకలు సాగించనున్నాయి. 2020 జూన్‌లో ఇరుదేశాల సైనికుల మధ్య తూర్పులద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో చోటు చేసుకున్న తీవ్ర ఘర్షణలు, కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో ప్రత్యక్ష విమాన సర్వీసులు నిలిచిపోయాయి. సరిహద్దుల్లో ఇరుదేశాల సైన్యాల మోహరింపులతో 2024 అక్టోబర్ వరకు తీవ్ర ఉద్రికతలు కొనసాగాయి. దీంతో రెండు దేశాల మధ్య వాణిజ్యం, పర్యాటకం, వ్యాపార సంబంధాలు దెబ్బతిన్నాయి. డైరెక్ట్ విమానాల రాకపోకలతో తిరిగి ఈ సంబంధాలు తిరిగి గాడినపడతాయని భావిస్తున్నారు.



## డ్రైవర్ సాయి బాబా మృతి

### అప్పుల బాధ తాళలేక ఆరోగ్యం క్షీణించి.. మంగళపర్తిలో విషాదం

**మెదక్ జిల్లా, మహా :** వెల్దుర్తి మండల పరిధిలో మంగళపర్తి గ్రామంలో యువకుడు తలారి సాయి బాబా డ్రైవర్ గా పనిచేస్తూ గ్రామంలో జీవనం కొనసాగించేవాడు. కుటుంబ సమస్యలు పెరగడంతో పాటు అప్పుల బాధ తాళలేక ఒత్తిడికి గురై ఆకస్మికంగా మృతి చెందారు. ఈ సమాచారం విన్న గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధులు భావోద్వేగానికి గురి అయ్యారు .సాయిబాబా అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ సర్పంచ్ బి రామకృష్ణారావు , స్థానిక యువకులు పాల్గొన్నారు గ్రామాల్లో దారిద్ర రేఖకు దిగువ ఉన్న కుటుంబాల ఆర్థిక స్థితిగతులు వర్ణనాతీతమని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలన్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.





## యూకేలో భారత యువతిపై లైంగిక దాడి..

### 45 రోజుల్లో రెండో ఘటన


**లండన్:** యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో దారుణ ఘటన చోటుచేసుకుంది. 20 ఏళ్ల భారతీయ యువతిపై లైంగిక దాడి జరిగింది. అయితే, ఈ ఘటన జాతి వివక్షతోనే జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న సీనియర్ పోలీసు అధికారి రోనన్ టైరర్ మాట్లాడుతూ..'వెస్ట్ మిడ్‌ల్యాండ్స్‌లో 20 ఏళ్ల భారత సంతతికి చెందిన ఒక యువతిపై లైంగిక దాడి జరిగింది. శనివారం వాల్సాల్‌లోని పార్క్ హాల్ ప్రాంతానికి వెళ్లినప్పుడు ఆమెపై జాతి వివక్ష కారణంగానే ఇలా దాడి జరిగింది. ఇందుకు కారణమైన వ్యక్తిని అరెస్టు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేపట్టాం. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. స్థానిక సీసీటీవీ ఫుటేజ్ నుండి వెస్ట్ మిడ్‌లాండ్స్ పోలీసులు నేరస్థుడి ఫొటోను విడుదల చేశారు. సాధ్యమైనంత త్వరగా అతన్ని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తాం. ఆధారాలను సేకరించే అధికార బృందాలు మా వద్ద ఉన్నాయి' అని తెలిపారు.

**సిక్కు యువతిపై లైంగిక దాడి..**

ఇక, యూకేలో భారత సంతతి ప్రజలపై జాత్యాహంకార దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. సెప్టెంబర్ నెలలో ఓల్డ్‌బరీ పట్టణంలో 20 ఏళ్ల సిక్కు యువతిపై ఇద్దరు దుండగులు లైంగిక దాడికి పాల్పడి, జాతి వివక్ష వ్యాఖ్యలతో దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ఓల్డ్‌బరీలోని టేమ్ రోడ్ సమీపంలో ఒంటరిగా ఉన్న యువతిపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా, "మీ దేశానికి తిరిగి వెళ్లిపో" అంటూ జాత్యాహంకార వ్యాఖ్యలతో దూషించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దీనిని జాతి వివక్షతో కూడిన దాడిగా పరిగణిస్తున్నామని తెలిపారు. ఈ ఘటన స్థానిక సిక్కు సమాజంలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. దీంతో, ప్రాంతంలో గస్తీ పెంచుతామని ఓ సీనియర్ పోలీస్ అధికారి హామీ ఇచ్చారు. ఈ అమానుష ఘటనను బ్రిటన్ ఎంపీలు తీవ్రంగా ఖండించారు. బర్మింగ్‌హామ్ ఎడ్జ్‌బాస్టన్ ఎంపీ ప్రీత్ కౌర్ గిల్ మాట్లాడుతూ.. "ఇది అత్యంత హింసాత్మక చర్య. 'మీరు ఈ దేశానికి చెందిన వారు కాదు' అని బాధితురాలితో అనడం దారుణం. కానీ ఆమె ఇక్కడికి చెందినవారే. ప్రతీ సమాజానికి సురక్షితంగా, గౌరవంగా జీవించే హక్కు ఉంది" అని పేర్కొన్నారు. మరో ఎంపీ జస్ అత్వాల్ స్పందిస్తూ, "దేశంలో పెరుగుతున్న జాతి వివక్ష ఉద్రిక్తతల ఫలితమే ఈ హేయమైన దాడి. దీనివల్ల ఓ యువతి జీవితాంతం మానసిక క్షోభ అనుభవించాల్సి వస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

## పాక్ మాకు మిత్రుడే..

### భారత్‌తో బంధం వదులుకోలేం: మార్కో రుబియో



**వాషింగ్టన్:** భారత్, పాకిస్తాన్ విషయంలో అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో కీలక వ్యాఖ్యలు చేశారు. పాక్‌తో వ్యూహాత్మక సంబంధాల విస్తరిస్తున్న సమయంలో భారత్‌ను దూరం చేసుకోలేమని చెప్పుకొచ్చారు. భారత్‌తో ఉన్న చారిత్రాత్మక, బలమైన, ముఖ్యమైన సంబంధాలను పణంగా పెట్టబోమని తెలిపారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌తో మార్కో రుబియో ఈరోజు భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'పాక్‌తో అమెరికా సంబంధాలపై కొన్ని కారణాల రీత్యా భారత్‌కు ఆందోళనలు ఉన్నాయి. వేర్వేరు దేశాలతో మాకు సంబంధాలు ఉండాలనేది భారత్ అర్థం చేసుకోవాలి. ఎన్నడూ భారత్‌తో బంధాలను మేం వదులుకోబోమని క్లారిటీ ఇచ్చారు. ఇదే సమయంలో పాక్‌తో వ్యూహాత్మక సంబంధాల విస్తరణలో మాకు అవకాశాలు కనిపిస్తున్నాయి. దౌత్యం, దానితో ముడిపడిన అంశాల వరకు భారతీయులు ఎంతో పరిపక్వతతో ఉంటారనే నేను భావిస్తున్నాను. ఎందుకంటే మాతో సంబంధాల్లేని కొన్ని దేశాలతో భారత్‌కు అనుబంధం ఉంది. అందువల్ల ఇదంతా పరిపక్వతతో కూడిన, ఆచరణీయ విదేశాంగ విధానం' అని చెప్పుకొచ్చారు. అలాగే, రష్యాతో చమురు కొనుగోళ్ల సంబంధాలను మళ్లించుకునేందుకు భారత్ ఇప్పటికే సంసిద్ధత వ్యక్తంచేసిందని చెప్పారు. ఇదిలా ఉండగా.. మలేషియా వేదికగా ఆసియన్ సదస్సు జరుగుతోంది. ఆసియాన్ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకునేందుకు ట్రంప్.. మలేషియా పర్యటనకు వచ్చారు. ఈ సమావేశంలో భారత ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రసంగించనున్నారు. ఆసియాన్ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, జపాన్ కొత్త ప్రధాని తకాయిచి, దక్షిణ కొరియా నేతలు కూడా పాల్గొననున్నారు.

## మద్యం దుకాణాల లక్కీ డ్రా ప్రశాంతంగా ముగించిన

### కలెక్టర్ నేతృత్వంలో కొనసాగిన ప్రక్రియ



**మెదక్ జిల్లా, మహా:** మద్యం దుకాణాల లైసెన్సుల జారీ కోసం సోమవారం మెదక్ బోధన్ రోడ్ లోని వెంకటేశ్వర గార్డెన్ లో లాటరీ ద్ధతిలో వైన్ షాపుల కేటాయింపునకు లక్కీ డ్రా నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ నేతృత్వంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా సాఫీగా ఈ ప్రక్రియ కొనసాగింది. నూతన ఎక్సయిజ్ పాలసీ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పక్కాగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 49 మద్యం షాపులకు గాను మొత్తం 1420 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఒక్కో షాపు వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన వారిని ఆహ్వానిస్తూ, వారి సమక్షంలో కలెక్టర్ రాహుల్ రాజ్ లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేశారు. లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా డ్రా నిర్వహించారు. ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా లక్కీ డ్రా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ జరిపించారు. పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు హాజరు కావడంతో టోకెన్ కలిగి ఉన్న వారినే లోనికి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వెంకటేశ్వర గార్డెన్ తో పాటు పరిసర ప్రాంతాల్లోనూ కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ మహేందర్, డి.ఎస్.పి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును పర్యవేక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. లక్కీ డ్రాలో అదృష్టం వరించి వైన్ షాపులు కేటాయించబడిన వారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన ఏర్పాట్లు కల్పించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి ఇతర అధికారుల పర్యవేక్షణలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీ డ్రా ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా లాటరీ ప్రక్రియ కొనసాగించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మీడియాతో మాట్లాడుతూ మెదక్ జిల్లాలో మొత్తం 49 మద్యం షాపులు ఉన్నాయని మెదక్ వెంకటేశ్వర గార్డెన్లో అత్యంత పారదర్శకంగా ఫోటోగ్రఫీ వీడియోగ్రఫీ ద్వారా లక్కీ డ్రా తీయడం జరిగిందన్నారు. ఇందులో రిజర్వేషన్ ప్రాతిపదికలో భాగంగా గాను ఎస్టి 01, ఎస్సీ06 , గౌడ కులానికి సంబంధించి09 మొత్తం 16 షాపులు కేటాయించామన్నారు, మిగతా 33 షాపులు అన్ రిజర్వ్ కింద కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో 18 షాపులకు మహిళలు లాటరీ గెలుచుకోగా, 31 షాపులకు పురుషులు దక్కించుకోవడం జరిగిందన్నారు. మద్యం టెండర్లు దక్కించుకున్న వారు డిసెంబర్ ఒకటో తేదీ నుంచి మద్యం షాపులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరు ఎమ్మెల్యే పై ఏసీబీ, ఇన్‌కమ్ ట్యాక్స్ కి ఫిర్యాదు

**హైదరాబాద్,మహా :** ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై యద్రాద్రి భువనగిరికి చెందిన వ్యక్తి ఏసీబీ ,ఇన్ కమ్ ట్యాక్స్ అధికారలకు ఫిర్యాదు చేశాడు. అలేరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత బీనామి పేరు మీద 100 ఏకరాలు ఉందని విచారణ జరపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తన పేరు మీద 43 ఏకరాల భూమి రూ.3కోట్లు విలువ చేస్తుందని ఆఫడవిట్ లో పేర్కొన్నట్లు వివరించారు. ఎమ్మెల్యే భార్య బీర్ల అనిత , బీనామీల పేరుమీద సుమారు 100ఏకరాలు భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.200కోట్లు ఉంటుందని ఎమ్మెల్యేగా గెలుపొందిన అనతికాలంలో ఎలా ఆస్తులు పెరిగాయో విచారణ చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే అక్రమ ఆస్తులపై చట్ట ప్రకారం దర్యాప్తు చేసి శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆస్తుల వివరాలు అందించేందకు, దర్యాప్తుకు సహకరిస్తానని ఫిర్యాదులో తెలిపారు.

## ఆ మంత్రి గర్భవతి!.. 83 మందిని కనబోతోంది: ప్రధాని సంచలన ప్రకటన

ఆమె మొన్నీమధ్యే మంత్రి పదవి చేపట్టి.. యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అయితే పదవి చేపట్టి నెల తిరగకకుండానే.. ఆమె నెల తప్పిందంటూ ఆ దేశ ప్రధాని సంచలన ప్రకటన చేశారు. ఆమె ఏకంగా 83 మంది పిల్లల్ని కనబోతోందంటూ విచిత్రమైన స్టేట్‌మెంట్ ఒకటి ఇచ్చాడు. అయితే.. ఆ ప్రకటన లోతుల్లోకి వెళ్తే అంతగా ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఉండకపోవచ్చు. అల్బేనియా ప్రధాని ఎడీ రమా (Edi Rama).. బెర్లిన్‌లో జరిగిన గ్లోబల్ డైలాగ్ (BGD) సమావేశంలో సంచలన ప్రకటన చేశారు. మొన్నీమధ్యే తాను కేబినెట్‌లోకి తీసుకున్న మంత్రి డియెల్లా (Diella) గర్భవతి అని ప్రకటించారు. అయితే ఆమె మనిషి అనుకుంటే పొరపడినట్లే!. ఆమె ప్రపంచంలోనే ఏఐ ఆధారిత మంత్రి. సాంకేతిక రంగంలో అర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ సంచలనాలు సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. యూరప్ దేశమైన అల్బేనియా మాత్రం ఈ అధునాతన సాంకేతికతను వినూత్నంగా ఉపయోగిస్తోంది. అవినీతిని నిరోధించేందుకు ఏఐ ఆధారిత అసిస్టెంట్ 'డియెల్లా'ను కేబినెట్ మంత్రిగా నియమించింది. ప్రపంచంలోనే ఈతరహా నియామకం జరగడం ఇదే తొలిసారి. అయితే.. ఆమె ద్వారా 83 మంది పిల్లలను పుట్టించి.. వాళ్లను పార్లమెంట్‌లోకి వదలబోతున్నారట. ఒక్కో సోషలిస్టు పార్టీ పార్లమెంట్ సభ్యునికి ఒక్కో సహాయకుడిగా కేటాయిస్తారట. "డియెల్లా ద్వారా మేము ఒక పెద్ద ప్రయోగం చేశాం. ఇప్పుడు ఆమె 83 పిల్లలతో గర్భవతి అయింది. పుట్టబోయే ఏఐ సంతానాన్ని సహాయకులు నియమించబోతున్నాం. వాళ్లు పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొని.. సభ్యులు గైర్హాజరైనప్పుడు జరిగిన చర్చలను నమోదు చేసి తగిన సూచనలు ఇస్తారు. ఉదాహరణకు.. మీరు కాఫీకి వెళ్లి తిరిగి రావడం మర్చిపోతే, ఈ పిల్లాడే మీకు ఆ హాల్‌లో ఏమి జరిగింది, ఎవరి మాటకు ప్రతిస్పందించాలో చెబుతాడు అంటూ అల్బేనియా ప్రధాని వివరించారు. పూర్తిగా తల్లి నుంచి సంక్రమించే జ్ఞానంతోనే ఆ పిల్లలు పని చేస్తారని అన్నారాయన. 2026 చివరినాటికల్లా ఈ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ఎడీ రామా ప్రకటించారు. డియెల్లా అంటే సూర్యుడు అని అర్థం. ఆ పేరుకు తగ్గట్లే ఆమెను అల్బేనియన్ సంప్రదాయ దుస్తులతో ముస్తాబు చేశారు. వాస్తవానికి ఈ ఏడాది జనవరిలోనే eAlbania అనే ప్లాట్‌ఫారంలో వర్చువల్ అసిస్టెంట్‌గా ఆమె సేవలు ప్రారంభించింది. ఆ సేవలను సమర్థవంతంగా నిర్వర్తించడంతో.. సెప్టెంబర్‌లో కేబినెట్ పదవి కట్టబెట్టారు.

## తుపాన్ ప్రభావంపై తెలంగాణ ప్రభుత్వం అలర్ట్

### మంత్రి ఉత్తమ్ కీలక సమీక్ష..

**హైదరాబాద్, మహా :** మొంథా తుఫాన్ ప్రభావంపై తెలంగాణ ప్రభుత్వం అలర్ట్ అయింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో కీలక సమీక్షా సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రంపై తుఫాన్ ప్రభావం ఏ మేరకు ఉంటుందనే విషయం గురించి చర్చ జరిగింది. అలాగే తుఫాన్ ప్రభావం కారణంగా ధాన్యం కొనుగోళ్లకు ఆటంకం లేకుండా చూడాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. టార్పాలిన్‌లను వినియోగించి ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 8,342 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. వీటిల్లో ఇప్పటికే 4,428 కేంద్రాలు ప్రారంభం అయ్యాయి. మిగిలినవి త్వరలో ప్రారంభం కాబోతున్నాయి. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 22, 433 మంది రైతుల నుంచి 1.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం విలువ దాదాపు రూ. 431.09 కోట్లు అని, ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

## నేడు సీఎంకు సినీ కార్మికుల సన్మానం

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సమావేశం నేపథ్యంలో టాలీవుడ్ కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం అన్ని తెలుగు సినిమాల షూటింగ్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయించారు. అంతేకాదు..మంగళవారం తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సన్మానం చేయబోతున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో ఈ సన్మాన కార్యక్రమం జరుగనుంది. కాగా, సినీ పరిశ్రమకు పూర్తిగా సహకారం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కానీ పరిశ్రమను నియంత్రించే పనులు ఎవరూ చేయొద్దని.. ఇది ప్రభుత్వం సహించదని స్పష్టం చేశారు. ఎవరైనా చట్ట పరిధిలో పనిచేయాల్సిందేనని ఇటీవల తనను కలిసిన నిర్మాతలు, దర్శకులకు స్పష్టం చేశారు. సినీ పరిశ్రమలో పని వాతావరణం బాగుండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.




## ఆంధ్రాకు వెళ్లొద్దు.. మొంథా అలర్ట్

### 43 రైళ్లు రద్దు.. మూడు రోజులు భీభత్సమే

**హైదరాబాద్, మహా :** మొంథా తుపాన్ ఆంధ్రా వైపు దూసుకొస్తోంది. దీంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వెంటనే అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇదిలా ఉండగా.. మొంథా తుపాన్ నేపథ్యంలో రైల్వేశాఖ అలర్ట్ అయ్యింది. తుపాన్ కారణంగా ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని విశాఖ మీదుగా నడిచే 43 రైళ్లను రద్దు చేస్తున్నట్లుగా తూర్పు కోస్తా రైల్వే ప్రకటించింది. రద్దయిన రైళ్లలో గోదావరి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్, గరీబ్ రథ్, విశాఖపట్నం తిరుపతి ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఎల్టీటీతోపాటు పలు ప్రధాన రైళ్లు, పలు ప్యాసింజర్ రైళ్లు ఉన్నాయి. నేటి నుంచి మూడు రోజులపాటు అంటే అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో విశాఖ మీదుగా సాగే రైల్వే సర్వీసులు రద్దయ్యాయి.

## ఒకే రోజు రెండుసార్లు తగ్గిన గోల్డ్ రేటు

**హైదరాబాద్, మహా :** భారీగా పెరిగిన బంగారం ధరలు.. క్రమంగా తగ్గుతూనే ఉన్నాయి. సోమవారం గోల్డ్ రేటు రెండుసార్లు తగ్గింది. ఉదయం గరిష్టంగా రూ. 1050 తగ్గిన రేటు.. సాయంత్రానికి మరో రూ. 1290 తగ్గింది (మొత్తం రూ. 2340 తగ్గింది). హైదరాబాద్, విజయవాడ మొదలైన ప్రాంతాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 2340 తగ్గి.. రూ. 1,23,280 వద్ద ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ. 2150 రూపాయలు తగ్గి రూ. 1,13,000 వద్దకు చేరింది. ఇదే ధరలు బెంగళూరు, ముంబై నగరాల్లో కూడా కొనసాగుతాయి. ఢిల్లీలో కూడా గోల్డ్ రేటు గణనీయంగా తగ్గింది. 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 2340 తగ్గి రూ. 1,23,430 వద్ద ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల రేటు రూ. 2150 తగ్గి రూ. 1,13,150 వద్దకు చేరింది.

**గోల్డ్ రేటు ఎందుకు తగ్గుతోంది?**

**అమెరికా డాలర్ బలపడడం:** డాలర్ విలువ పెరిగితే.. బంగారంపై పెట్టుబడులు తగ్గుతాయి. ఎందుకంటే బంగారం డాలర్‌లోనే ట్రేడ్ అవుతుంది.

**వడ్డీ రేట్లు పెరగడం:**
అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచితే, ఇన్వెస్టర్లు బంగారం కంటే బాండ్లు లేదా ఇతర వడ్డీ ఇచ్చే ఆస్తుల్లో పెట్టుబడి పెడతారు.

**ద్రవ్యోల్బణం తగ్గడం:** ద్రవ్యోల్బణం తగ్గితే, బంగారాన్ని సురక్షిత పెట్టుబడిగా భావించేవారు సంఖ్య తగ్గుతుంది.

**రాజకీయ పరిస్థితులు:** ప్రపంచ రాజకీయ పరిస్థితులు కొంత స్థిరంగా ఉండడం వల్ల, బంగారం ధరలపై ఒత్తిడి తగ్గుతుంది.

**చైనాలో డిమాండ్ తగ్గడం:** బంగారాన్ని అధికంగా కొనుగోలు చేసే దేశాల జాబితాలో చైనా, భారత్ ముందు వరుసలో ఉంటాయి. అయితే చైనాలో ఆర్థిక మందగమనం వల్ల డిమాండ్ కొంత తగ్గింది. ఇవన్నీ బంగారం ధరపై ప్రభావం చూపుతున్నాయి.

RESEARCH REPORT

# కౌలు రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వాలు

**కౌలురైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ ఒక సంచలన రిపోర్ట్ రూపొందించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో, అవశేష ఆంధ్రప్రదేశ్ లో కౌలురైతులను ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అత్యధిక శాతం మంది కౌలురైతులు భావిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం, పీపుల్స్ పల్స్ రీసర్చ్ సంస్థ కలిసి నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో వెల్లడైంది.**

కౌలురైతుల సమస్యలను ఏ రాజకీయపార్టీ పట్టించుకోవట్లేదని 92.1 శాతం మంది కౌలురైతులు తెలుపగా, పట్టించుకుంటున్నారని కేవలం 6.1, తెలియదని 1.9 శాతం మంది తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలురైతుల సమస్యలపై 20 సెప్టెంబర్ నుండి 20 అక్టోబర్ వరకు ఒక నెలరోజులపాటు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం క్షేత్రస్తాయిలో 26 జిల్లాల్లో సర్వే నిర్వహించి దాదాపు 3000 శాంపిల్స్ సేకరించింది. ఒక్కొక్క జిల్లానుండి 100 నుండి 125 శాంపిల్స్ సేకరించడం జరిగింది.

- క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వే ప్రకారం కౌలురైతుల్లో దాదాపు 70 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందినవారే ఉన్నట్లు వెల్లడైంది.
- ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం సభ్యులు సేకరించిన డేటాను పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ డేటా ఎంట్రీ చేసి, అనాలసిస్ చేసి నివేదికను రూపొందించింది.
- కౌలురైతులకు గుర్తింపు కార్డు ఇచ్చిందా అని ప్రశ్నించినప్పుడు 87.7 శాతం మంది ఇవ్వలేదని కేవలం 12.3 శాతం మాత్రమే ఇచ్చిందని తెలిపారు.
- రాష్ట్రంలో కౌలురైతులు కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దానికి ప్రధాన కారణం 2024 ఎన్నికల్లో కౌలురైతులకు ఇస్తామన్న గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడమే.
- కౌలు రైతుల గుర్తింపునకు ప్రతిబంధకంగా తయారయిన పంట సాగుదారు హక్కు చట్టం (సిసిఆర్సి) స్థానంలో కొత్తగా చట్టం తెస్తామని కూటమి హామీ ఇచ్చినా ఇది అమలుకాకపోవడం పట్ల కౌలురైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు క్షేత్రస్థాయి సర్వేలో వెల్లడైంది.
- కూటమి ప్రజాగళం పేరిట విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి అన్నీ సంక్షేమ పథకాలతో పాటు, పంటల భీమాను వర్తింపజేస్తామని హామీ ఇచ్చి 17 నెలలు కావొస్తున్నా... ఇది కార్యరూపం దాల్చకపోవడంతో కౌలు రైతులు కూటమి ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలోనే కౌలు రైతుల కోసం చట్టం తీసుకొస్తామని ప్రకటించినా ఈ చట్టాన్ని తీసుకురాకపోవడం పట్ల కౌలురైతులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.
- కౌలురైతుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రశ్నిస్తే తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయాలని 27.4 శాతం, గుర్తింపు కార్డు ఇవ్వాలని 22.7 శాతం, పండించిన పంటకు గిట్టుబాటు ధర కావాలని 12.9 శాతం, పెట్టుబడికి రుణాలు మంజూరు చేయాలని 10.9 శాతం, రుణమాఫీ చేయాలని 10.5 శాతం మంది కోరారు.
- వ్యవసాయం చేయడానికి పెట్టుబడి సంవత్సరానికి ఎంత అవసరమౌతోందని కౌలురైతులు ప్రశ్నించినప్పుడు 60 వేలకు పైన 34.3 శాతం , 40 వేల నుండి 60 వేల వరకు 23.8 శాతం, 25 వేల నుండి 45 వరకు 34.8 శాతం, 10 వేల నుండి 25 వేల వరకు 7.2 శాతం మంది కౌలురైతులు తెలిపారు.
- వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడి సహాయానికి ఎవరిపైన ఆధారపడుతున్నారని కౌలురైతులను ప్రశ్నించగా వడ్డీ వ్యాపారుస్థుల నుండి 38.1, రైస్ మిల్లర్లు, దళారులు, వ్యాపారస్థుల నుండి 28.8, కోఆపరేటివ్ బ్యాంకులు నుండి 13.5, భూయజమానుల నుండి 12.7, జాతీయ బ్యాంకుల నుండి 2.5 శాతం ఆర్థిక సహాయం పొందుతున్నామని కౌలురైతులు తెలిపారు.
- ప్రైవేట్ వ్యక్తుల దగ్గర తీసుకునే అప్పుకు ఎంత వడ్డీ చెల్లిస్తున్నారని ప్రశ్నించినప్పుడు అత్యధిక శాతం కౌలురైతులు 2 రూపాయలు చెల్లిస్తున్నామని 79 శాతం మంది తెలిపారు. రూపాయిన్నర చెల్లిస్తున్నామని 6.7 శాతం, ఒకరూపాయి చెల్లిస్తున్నామని 1.8 శాతం, 3 రూపాయలు చెల్లిస్తున్నామని 8.2 శాతం మంది తెలిపారు.
- ఎకరానికి ఎంత పెట్టుబడి పెడుతున్నారని కౌలురైతులను ప్రశ్నించగా 60 వేల పైన 26.5, 40 వేల నుండి 60 వేల వరకు 21.5 శాతం, 20 వేల నుండి 40 వేల వరకు 33.8 శాతం, 10 వేల నుండి 20 వేల వరకు 13.3 శాతం పెట్టుబడి పెడుతున్నట్లు సర్వేలో వెల్లడైంది.
- ఒక పంట సాగుచేస్తే సంవత్సరానికి ఎంత ఆదాయం కౌలురైతులకు వస్తుందని ప్రశ్నిస్తే 25 వేల పైన ఆదాయం వస్తోందని 28.1 శాతం, లాభం లేదు, నష్టం లేదని 19.4 శాతం మంది తెలుపగా, నష్టం వస్తోందని 15.4 శాతం మంది తెలిపారు.




- కూలీలకే దాదాపు 69.8 శాతం ఖర్చు చేస్తున్నామని కౌలురైతులు తెలిపారు.
- ప్రస్తుతం మీకు ఎంత అప్పు ఉందని కౌలురైతులను ప్రశ్నించగా 5 లక్షల పైన 20.4 శాతం, 3 లక్షల నుండి 5 లక్షల వరకు 14.5 శాతం , లక్షన్నర నుండి 3 లక్షల వరకు 34.6 శాతం, 50 వేల నుండి లక్షా 50 వేల వరకు 21.5 శాతం, 50 వేల కన్నా తక్కువ 9 శాతం మందికి అప్పు ఉన్నట్లు క్షేత్రస్థాయి సర్వేలో వెల్లడైంది.
- కౌలురైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ధరలు, కూలీరేట్లు, యంత్రాల అద్దెలు పెరిగిపోవడమని 67.2 శాతం మంది తెలుపగా అధిక కౌలు వల్ల అని 12.5 శాతం, గిట్టుబాటు ధరలు రాకపోవడం వల్ల అని 10.8 శాతం, అధికవడ్డీలతో అప్పులు పెరిగిపోవడం అని 5.5 శాతం, మార్కెటింగ్ సమస్యల వల్ల అని 4 శాతం మంది చెప్పారు.
- కౌలురైతులు ముఖ్యంగా ఎరువుల విషయంలో, పంట నష్టం వచ్చినప్పుడు భూయజమాని కౌలుతగ్గించకపోవడం, అకాలవర్షాలు, కరువు కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వాలు ప్రకటించే అరకొర సహాయం కూడా కౌలురైతులకు అందకపోవడం తదితర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైంది.
- ఎకరానికి కౌలు ఎంత చెల్లిస్తున్నారని ప్రశ్నించినప్పుడు కొంతమంది నగదు రూపంలో చెప్పగా, కొంత మంది బస్తాలు (ధాన్యం) రూపంలో తెలిపారు.
- సంవత్సరానికి 35 వేల పైన భూయజమానులకు కౌలు చెల్లిస్తున్నామని 5.1శాతం , 25 వేల నుండి 35 వేలు అని 8.7 శాతం, 10 వేల నుండి 25 వేలు 27.3 శాతం, 10 వేల కన్నా తక్కువ అని 22.4 శాతం మంది తెలిపారు.
- సంవత్సరానికి ఎకరానికి 20 నుండి 30 బస్తాలు (ధాన్యం) భూయజమానులకు కౌలుకింద పంటలో భాగం ఇస్తున్నామని 13.2, 15 నుండి 20 బస్తాలు (ధాన్యం) 8.7, 10 నుండి 15 బస్తాలు (ధాన్యం) 14.5 శాతం మంది ఇస్తున్నామని వారు తెలిపారు.
- కౌలు ఒప్పందం మాట రూపంలోనే చేసుకుంటామని 92.3 తెలుపగా, రాతపూర్వకంగా ఒప్పందం చేసుకుంటామని 3.9, రెవెన్యూ రికార్డులో నమోదు ద్వారా 2.6 శాతం తెలిపారు.
- 10 ఎకరాలకు పైగా కౌలు తీసుకుంటున్న రైతులు 15.9 శాతం, 4 నుండి 10 ఎకరాలు 34.8 శాతం, 1 నుండి 3 ఎకరాలు 43.6 శాతం, ఒక ఎకరం కంటే తక్కువ 5.7 శాతం మంది భూయజమానుల నుండి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది.
- 20 సంవత్సరాలకు పైగా కౌలుకు వ్యవసాయం చేస్తున్న రైతులు 35.5 శాతం ఉండగా, 11 నుండి 20 సంవత్సరాల వరకు 17.4 శాతం, 6 నుండి 10 సంవత్సరాలు 20 శాతం, 1 నుండి 5 సంవత్సరాల వరకు 27 శాతం మంది ఉన్నారు.
- సామాజికంగా మీరు ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా అని ప్రశ్నించినప్పుడు, భూయజమానులకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఉచితంగా సర్వీస్ చేయవలసి వస్తుందని, బడుగుబలహీనవర్గాల వారి నుండి ఎక్కువ వడ్డీ వసూలు చేస్తూ తమ సామాజికవర్గానికి మాత్రం తక్కువ వడ్డీకే అప్పులు ఇస్తున్నట్లు కౌలురైతులు తెలిపారు. కౌలు రేట్ల విషయంలో కూడా ఇటువంటి వ్యత్యాసాలు ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది.
- ఒక్కరికే ప్రతి సంవత్సరం కౌలుకు ఇస్తే భూమి మీద కౌలురైతులకు హక్కులు వస్తాయనే ఆందోళనలో భూయజమానులకు ఉన్నట్లు ఈ సర్వేలో తేలింది.
- కౌలుకు ఇచ్చిన భూములపై భూయజమాని ముందుగానే పంటరుణాలు తీసుకుంటున్నారని, భూయజమానులు బ్యాంకుకు బకాయి ఉంటే వారి భూములు సాగుచేస్తున్న కౌలురైతులకు పంటరుణాలు ఇవ్వడం లేదని సర్వేలో తేలింది.
- క్షేత్రస్థాయిలో సర్వే సందర్భంగా కౌలురైతులతో మాట్లాడినప్పుడు నూతనంగా తీసుకొస్తామని చెప్పిన కౌలు చట్టంపై కూటమి ప్రభుత్వం యూటర్న్ తీసుకుందనే భావనలో అత్యధిక శాతం మంది కౌలురైతులు ఉన్నారు.
- రాష్ట్రప్రభుత్వానికి కౌలు చట్టాన్ని తీసుకురావాలనే చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ సమావేశాలు లేకపోయినా ఆర్డినెన్స్ ద్వారా ఈ చట్టాన్ని తీసుకొని రావచ్చనే పలు చోట్ల కౌలురైతులు తెలిపారు.
- కౌలుదారులకు కొత్త చట్టం తీసుకురావడం కోసం కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 5 సదస్సులు నిర్వహించి కౌలు రైతులు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సేవాసంస్థల నుండి అభిప్రాయాలు సేకరించారు. ఈ సేకరించిన సమాచారాన్ని చెత్త బుట్టలో వేశారా? లేక పరిగణలోనికి తీసుకుంటారా? అనే విషయం పై స్పష్టత లేదని పలు చోట్ల రైతులుతెలిపారు.
- ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా కౌలు రైతులకు భూయజమాని ప్రమేయం లేకుండా గుర్తింపు కార్డులు జారీ చేస్తామని చెప్పినప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు కావొస్తున్నా కౌలు చట్టం అమలు కాలేదు, గుర్తింపు కార్డులు అందలేదు.
- గుర్తింపు కార్డులు లేకపోవడంతో బ్యాంకులు కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదు, దీంతో వడ్డీకి అప్పులు తీసుకోవాల్సి వస్తోంది, అప్పుల భారం పెరుగుతోంది.
- ఈ పంటలో నమోదు చేసుకోలేకపోవడంతో వరదలు, తుఫానుల వల్ల పంట నష్టపోయిన కౌలు రైతులకు ఇన్పుట్ సబ్సిడీలు అందడం లేదు, ఆర్థికంగా నష్టపోతున్నారు.
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కౌలు రైతులు పంటలు అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది, గుర్తింపు లేకపోవడంతో దళారులకు తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోంది.
- వర్షాభావం, తెగుళ్ల వల్ల దిగుబడి తగ్గుతోంది. కానీ కౌలు రైతులకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందడం లేదు.
- చాలా మంది కౌలు రైతులు నోటి మాటతో ఒప్పందాలు చేసుకుని భూమిని తీసుకుంటారు. దీనివల్ల భూయజమానులతో వివాదాలు వచ్చినప్పుడు వారికి చట్టపరమైన రక్షణ లభించడం లేదు, ఫలితంగా సాగుచేయడానికి భూమిని, భూమిలో పెట్టిన పంటను కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు.
- ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు చేయడం గురించి కౌలు రైతులకు తగిన శిక్షణ లేదా సాంకేతిక సమాచారం అందడం లేదు, దీంతో దిగుబడి తగ్గుతోంది.
- కౌలు రైతులు పంటల బీమా పథకాల్లో చేరలేకపోతున్నారు, ఎందుకంటే వారి వద్ద భూమి యాజమాన్య పత్రాలు లేవు. దీనివల్ల పంట నష్టపోయినప్పుడు వారికి ఎలాంటి భరోసా లేదు.
- రైతు భరోసా పథకం కౌలు రైతులకు సహాయం చేయడానికి ప్రవేశపెట్టబడినప్పటికీ, అర్హత పత్రాలు లేకపోవడం, అవగాహన లోపం వల్ల చాలా మందికి ఈ పథకం ప్రయోజనం అందడం లేదు.
- భూ యజమాని తీసుకునే రుణంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డు కలిగిన ప్రతీ కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలను మంజూరు చేయాలని కౌలు రైతులు కోరుతున్నారు.
- కౌలు రక్షణ చట్టాన్ని ఆర్డినెన్స్ ద్వారా కూటమి ప్రభుత్వం వెంటనే తీసుకొచ్చి కౌలు రైతులకు భరోసా ఇవ్వాలని, అవసరమైతే ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించైనా ఈ చట్టాన్ని తీసుకొనిరావాలని అత్యధిక శాతం మంది కౌలురైతులు కోరుతున్నారు.
- కోనసీమ జిల్లా... ఐ. పోలవరం గ్రామంలో ఒక సామాన్యరైతు చెప్పిన ఈ యదార్థ కథ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కౌలు రైతుల పరిస్థితి అద్దం పడుతుంది. దాదాపు రాష్ట్రంలోని కౌలు రైతులంతా ఇదే దుస్థితిని ఎదుర్కొంటున్నారు.
- కౌలుకు సాగు చేస్తే రెండు ఎకరాలకు దిగుబడి 140 బస్తాలు వస్తాయి.(మొదటి పంటకు 60బస్తాలు,రెండో పంటకు 80బస్తాలు) ఒక బస్తా 75 కేజీలని మన గమనంలో ఉండాలి.
- రెండు ఎకరాలు కలిగిన భూ యజమానికి రూ.కౌలు నిమిత్తం 48 బస్తాలు ఇవ్వాలి.(అంటే రెండు పంటలకు కలిపి ఎకరాకు 24బస్తాలు)కౌలు పోను 102 బస్తాలు మిగులుతుంది.
- 102 బస్తాలు × రూ.1600లకు అమ్మితే వచ్చే ఆదాయం రూ.163,000.(ఒకబస్తాను రూ.1600లకు అమ్మితే)
- పెట్టుబడి రెండు ఎకరాలకు రెండు పంటలకు కలిపి రూ.1,40,000. (మొదటి పంటకు రూ.60వేలు,రెండో పంటకు రూ.80వేలు)
- పెట్టుబడికి తెచ్చిన అప్పుకు వడ్డీ సుమారు రూ.20వేలు కలుపు కుంటే
- మొత్తం రూ.1,60,000. మొత్తం ఆదాయంలోనుంచి ఖర్చులు తీసివేస్తే రూ.3000వేలు మిగులుతుంది.
- సంవత్సరం మొత్తం కష్టపడితే ఒక రైతు కుటుంబానికి రూ.3000, రోజుకు రూ.8లు మిగులుతుంది.
- భూమి సారం,విత్తన నాణ్యత,నీటి లభ్యత,వాతావరణం అనుకూలం,తెగుళ్లు లేకుండా ఉండి కూలీలు తక్కువ ఉపయోగించుకుని, సాంకేతిక పరిజ్ఞానం వాడుకుంటే ఆ సమయంలో మార్కెట్ లో కనీసం మద్దతు ధరలు దక్కించుకుంటే ఆ మేరకు అప్పులు లేకుండా బయట పడతాడు లేకపోతే కోలుకోలేని దెబ్బ తింటాడు.

## భూ యజమానికి లాభాలు

- భూ యజమానికి పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.20,000 మూడు దఫాలుగా ఇస్తున్నాయి.
- బ్యాంకు నుంచి రెండు ఎకరాలకు "స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ "ప్రకారం సుమారు రూ.80 వేలు రుణం తీసుకుంటాడు.లక్ష రూపాయలు లోపు రుణం తీసుకున్న వారికి సకాలంలో చెల్లిస్తే సున్నా వడ్డీ కింద బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. ఆ భూ యజమాని బ్యాంకుకు వడ్డీ కట్టవలసిన అవసరం లేదు. పైగా ఆ రూ.80వేలు బయట వ్యక్తులకు వడ్డీకి నూటికి రెండు రూపాయల చొప్పున ఇస్తే సుమారు రూ. 20 వేలు ఆదాయం వస్తుంది.
- కౌలు రూపంలో రెండు ఎకరాలకు గాను సుమారు రూ.78 వేలు పైగా ఆదాయం వస్తుంది. సంవత్సరానికి రూ.ఒక లక్ష 18వేలు ఆదాయం భూ యజమానికి సమకూరుతుంది.
- భూ యజమానులు సంపాదించిన డబ్బులు బ్యాంకులో పెడితే ఆదాయ పన్ను చెల్లించాలి. భూములకు ఎటువంటి పన్నులు లేవు కాబట్టి భూములు కొనుగోలు చేసి ఆదాయాన్ని ఆదా చేసుకుకోవడానికి ఇది భూమి కొనుగోలు ఒక వనరుగా మారింది.
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కౌలు ధాన్యం మరియు ఇతర పంటలు అమ్ముకున్నప్పుడు మద్దతు ధరతో పాటు కాటా, హమాలీ కూలీ,రవాణా ఖర్చులు కూడా ఇస్తున్నాయి.పంటల ధరలు మాత్రమే లెక్కగట్టి కౌలురైతులకు ఇస్తున్నారు. కాటా కూలీ,హమాలీ కూలీ,రవాణా చార్జీలు మాత్రం భూ యజమానులే ఉంచుకుంటున్నారని కౌలురైతులు చెబుతున్నారు. ఇది ఒక కనిపించని మరోక ఆదాయం.
- సబ్సిడీ వ్యవసాయంత్ర పరికరాలు ముఖ్యంగా (ట్రాక్టర్ లాంటి) కూడా భూ యజమానులకే ఇస్తున్నారు. వీటిని ఆ గ్రామంలో కౌలు రైతులకు రెంట్ కు ఇస్తున్నారు. ఇది లెక్కలోకి రాని అదనపు ఆదాయం.
- రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పంటల అమ్ముకునే సందర్భంలో పంటల ధరలు పోయినప్పుడు అప్పడప్పుడు బోనాస్,ఇన్సెంటీవ్స్ కింద డబ్బులు ఇస్తుంది. అవి కూడా భూ యజమానులకే వెళ్తున్నాయి.
- భూములను కౌలుకు ఇచ్చిన యజమానులు ఆ గ్రామంలో ఎక్కువ మంది ఉండటం లేదు. వీరంతా వివిధ పట్టణాల్లో ,రాష్ట్రాల్లో, వివిధ దేశాల్లో నివసిస్తున్నారు. వాళ్ళ భూమికి రక్షణ అవసరం. అటువంటి నేపథ్యంలో భూమిని కౌలుకు ఇచ్చి కౌలురైతును సంరక్షుడిగా పెట్టుకుంటున్నారు. అంటే కాపల దారుడు గానూ, వాచ్మెన్ గానూ ఉంటున్నాడు
- భూమిని కౌలుకు తీసుకున్న కౌలు రైతు ఆ భూమిలో రాళ్లు, రప్పలు ప్రతి సంవత్సరం తీసి వేసి భూమిని నిరంతరం శుభ్రం చేస్తూ తన శ్రమ ద్వారా ఆ భూమి యెక్క విలువను పెంచుతాడు. భూ యజమాని అవసరమై ఆ భూమిని అమ్మకానికి పెట్టినప్పుడు కొనుగోలుదారులు ఆ భూమిని చూసి ఎక్కువ రేటు పెట్టి కొనుగోలు చేయడానికి సిద్ధపడతారు.ఇది ఒక ప్రయోజనం.
- ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో భూ యజమాని ఇంట్లో శుభ, అశుభ కార్యక్రమాలు జరిగిన నేపథ్యంలో భూమిని కౌలు తీసుకున్న కౌలు రైతులు ఆ ఇంటికెళ్లి కొన్ని పనులు చేయవలసి ఉంటుంది. అది వివిధ రూపాల్లో ఉంటుంది. కొన్ని పనులకు విలువ కట్టలేం. ఇది ఒక రకమైన సామాజిక (వెట్టిచాకిరి) సర్వీసు. భూమిని కౌలుకి ఇచ్చాడనే దృక్పథంతో కౌలు రైతులు కొన్ని పనులు చేస్తారు. ఇది కూడా భూ యజమానికి ప్రయోజనమే.
- ఇవి గాకుండా ప్రకృతి వైపరీత్యాలు వల్ల పంటల దెబ్బతింటే వచ్చే ఇన్ పుట్ సబ్సిడీ మరియు పంటల భీమా పరిహారం భూ యజమానికే పోతాయి పెట్టుబడి పెట్టిన కౌలురైతుకు కనీసం ఖర్చు కూడా రాకుండా వీధిలో పడతాడు.
- కౌలు దోపిడీ, వడ్డీ దోపిడీ, మార్కెట్ దోపిడీ, ఇన్ పుట్ ధరల దోపిడీ (విత్తనాలు,ఎరువులు పురుగు మందులు ధరలు నిరంతరం పేరుగుదల)వీటికి తోడు ప్రకృతి విపత్తులతో కౌలురైతులు అల్లాడిపోతున్నారు.
- చెమట చుక్క చిందించకుండానే భూ యజమాని అనేక ప్రయోజనాలు పొందుతున్నాడు.
- పంట వేసినప్పుడు దిగుబడి వస్తుందో రాదో,మద్దతు ధర దక్కుతుందో లేదో, కనీసం పెట్టిన పెట్టుబడి వస్తుందో, రాదో అని తీవ్రమైన ఆందోళనతో కౌలురైతు మానసికంగా కృంగిపోతుంటారు.
- తద్వారా అనేక రోగాలకు, రుగ్మతలకు గురవుతున్నారు. చేసిన అప్పులు తీర్చలేక వేరే మార్గం లేక ప్రభుత్వాలు కనుకరించక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.భాదిత కుటుంబాలకు కౌలుగుర్తింపు కార్డు (భూ యజమాని కార్డు ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో) లేకపోవడం చేత రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎక్స్ గ్రేషియా అందనటువంటి దయనీయమైన స్థితిలో కౌలు ఉన్నారు.
- ఓట్ల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణమాఫీ పథకం పెడితే బ్యాంకులో ఉన్న రుణాలను మాత్రమే మాఫీ చేస్తున్నారు. దీని వల్ల కౌలురైతులకు ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఈ పథకాల ద్వారా భూ యజమానులే లబ్ధి పొందుతున్నారు.
- ఒక మాటలో చెప్పాలంటే యజమానిని బతికించడం కోసమే కౌలురైతులు బతుకుతున్నారా? అన్నఆలోచన రాకతప్పడం లేదు. భూమిని కౌలుకు ఇచ్చిన భూ యజమానులకు( వ్యవసాయానికి సంబంధించిన) ఎటువంటి ఆందోళనలు,మానసిక వత్తిడి లేకుండా ప్రశాంతంగా, ఏ రోగాలు లేకుండా జీవితం గడుపుతున్నారు.పైగా కౌలురైతులపై వివిధ ఆరోపణలు చేస్తుంటారు.
- ప్రస్తుతం రాష్ట్రంలో 25శాతం మంది భూ యజమానులే సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నారు.
- మరి కొంత మంది సొంత భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు.
- ముఖ్యంగా సొంత భూమి లేని పేదలు కౌలుకు భూమి తీసుకుని సాగు చేసే వారు గణనీయంగా ఉన్నారు.

**ఇది ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కౌలు రైతుల ప్రాథమిక స్థితి!**

# పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి

## ప్రభుత్వం పత్తి రైతులకు అండగా ఉంటుంది.. మంత్రి కొండా సురేఖ

## కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, కమిషనర్




**వరంగల్ మహా;** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ లోని ఏనుమాముల మార్కెట్ యార్డ్ లో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన సి సి ఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్దదైన వరంగల్ వ్యవసాయ మార్కెట్లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించుకోవడం సంతోషదాయకమన్నారు.రైతులు సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని దృఢంగా నమ్మి దివగంత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా, గిట్టుబాటు ధర, సబ్సిడీ మీద విత్తనాల పంపిణీ,ఇండస్ట్రియల్ పాలసీని తీసుకురావడం వల్ల రైతులకు ఎంతో మేలు జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్ కు తీసుకొచ్చి గరిష్ఠ ధరను పొందాలని ఎనుమాముల మార్కెట్ కు వచ్చిన పత్తి బస్తాలను కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మంత్రి సూచించారు. తేమను దృష్టిలో ఉంచుకొని ధర నిర్ణయించడం జరుగుతున్నందున, తేమ వల్ల రైతులు నష్టపోకుండా పరిశీలించేందుకు కమిటీని వేయడం జరిగిందన్నారు.ప్రతి విక్రయించిన మూడు నుండి ఐదు రోజుల్లోనే సంబంధిత రైతు బ్యాంక్ అకౌంట్ కు నేరుగా డబ్బులు జమవుతాయన్నారు. రైతుల సంక్షేమం కొరకు రైతులకు 24గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. సీసీఐ ద్వారా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు ఏ ఇబ్బందీ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారని, వరి, మొక్కజొన్న కేంద్రాలను ప్రారంభించి రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు. తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టాలని చూస్తే ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. వ్యవసాయ అధికారుల వద్ద తేమ యంత్రాలు ఉన్నాయని, రైతుల పొలాల వద్దనే తేమ శాతం పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి రైతులకు నష్టం చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సంవత్సరం 32298 క్వింటాళ్ల పత్తి మార్కెట్ యార్డ్ కు వచ్చిందని, జిల్లాలో మొత్తం 23 జిన్నింగ్ మిల్లులో సామర్థ్యం రోజుకు 4980 బెల్లు అని అన్నారు.మద్దతు ధర 8110 రూపాయలు కల్పించడం జరిగిందని, తేమశాతం 8 శాతానికి మించ కూడదని, ఇంటి వద్దనే పత్తి ఆరబెట్టుకుని నాణ్యతగా పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం ఆన్లైన్లోనే రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏఈఓ ల ద్వారా చేపట్టి రైతులకు జిన్నింగ్ మిల్లుల వద్ద వేచి ఉండే ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రత్తిని అమ్ముకునేవా రైతులు నేరుగా మార్కెట్ కు మిల్లులకు రాకుండా కిసాన్ కపాస్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని ఆయా మిల్లులకు కేటాయించిన తేదీల్లో అమ్ముకోవాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800 5995779, వాట్సప్ నెంబర్ 889728 1111 కు సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కూడా మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, సిసిఐ జనరల్ మేనేజర్ మోహిత్ శర్మ, మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, డిసిఓ నీరజ, కాటన్ కొనుగోలు అధికారి కృష్ణారెడ్డి, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 1 కోటి 99 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

### కార్యక్రమాల్లో పాల్గొన్న నగర మేయర్, కమీషనర్



**వరంగల్ మహా;** బల్దియా పరిధిలోని 12వ డివిజన్ దేశాయి పేట లో గల నెహ్రూ మెమోరియల్ స్కూల్ నుండి టౌన్ షిప్ సమీపం లో కాకతీయ కెనాల్ వరకు బల్దియా జనరల్ ఫండ్ నిధులు రూ.50 లక్షల అంచనా వ్యయం తో నిర్మించనున్న సిసి రోడ్డు పనులు, అలాగే 13వ డివిజన్ పరిధి లోని గణేష్ నగర్ ప్రాంతం లో బల్దియా జనరల్ ఫండ్ నిధులు రూ.99 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సి సి రోడ్డు పనులు, ఎం హెచ్ నగర్ లో సి బిట్ తో పాటు డివిజన్ లో దెబ్బతిన్న రోడ్డు నిర్మాణ పనులు, శ్రీనివాస్ కాలనీ లో నిర్మించ తలపెట్టిన యూ జీ డి, సి సి రోడ్డు పనులు, గణేష్ నగర్ లో అంతర్గత, ఇతర లేన్ పనులు, సి సి రోడ్డు పనులతో పాటు 22వ డివిజన్ కొత్తవాడ ప్రాంతం లో బల్దియా జనరల్ ఫండ్స్ నిధులతో రూ.50 లక్షల అంచనా వ్యయం తో అలంకృత బ్యూటీ పార్లర్ నుండి హాయ్ బ్యూటీ పార్లర్ వరకు, తోట మైదానం కౌసర్ చికెన్ సెంటర్ నుండి మనీ కర హోమ్ ఫుడ్ వరకు నిర్మించ తలపెట్టిన సిసి రోడ్లు,(ఇరువైపుల) డ్రైన్ నిర్మాణ పనులకు గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి సోమవారం రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాలలో కార్పొరేటర్లు కావేటి కవిత, సురేష్ జోషి, బస్వరాజు కుమార స్వామి, సీనియర్ నేతలు గోపాల్ నవీన్ రాజ్, మీసాల ప్రకాష్, చిట్టి మల్ల రమేష్ బాబు, డివిజన్ల అధ్యక్షులు సయ్యద్ వసీం, కె సంపత్ కుమార్, కరుణాకర్, రాజు, కాంగ్రెస్ యూత్ నాయకులు బత్తుల వినోద్ కుమార్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.

## డ్రా ద్వారా మద్యం దుకాణాల లైసెన్స్ దారుల ఎంపిక

### డ్రా ప్రక్రియను ప్రారంభించిన అదనపు కలెక్టర్ సంధ్యారాణి




**వరంగల్ మహా;** వరంగల్ నగరం లోని నాని గార్డెన్స్ లో సోమవారం ఏ4 మద్యం దుకాణాల లైసెన్స్ దారుల ఎంపిక (2025-2027) కార్యక్రమం డ్రా పద్ధతి ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి డ్రా ప్రక్రియను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఇతర సంబంధిత అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ డ్రా కార్యక్రమం పూర్తిగా పారదర్శకతతో పాటు నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు. మొత్తం దరఖాస్తులు 1958 రాగా ఎంపికైన 57 లైసెన్స్ దారులకు అధికారులు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారి అరుణ్ కుమార్, సహాయ ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారి మురళీధర్, సిఐ రమేష్ చంద్ర, లైసెన్స్ దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## డివిజన్‌లో వీధి కుక్కలను నియంత్రించాలి

### కార్పొరేటర్ మామిండ్ల రాజు



**హన్మకొండ మహా;** గ్రేటర్ వరంగల్ లోని 31 డివిజన్ లోని టైగర్ హిల్స్ లో కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి కంత్రి కృతిక ను బల్దియా వెటర్నరీ ఆఫీసర్ గోపాలరావు తో కలిసి స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు పరామర్శించారు. ఆదివారం టైగర్ హిల్స్ లోనే చిన్నారి ఇంటి వద్దకు వెటర్నరీ ఆఫీసర్ గోపాలరావు తో కలిసి కుక్కల దాడి సంఘటన గురించి తెలుసుకొని చిన్నారి పై కుక్కలు దాటి చేయడం తనను ఎంతో బాధించిందని కార్పొరేటర్ రాజు పేర్కొన్నారు. డివిజన్లో కుక్కలను నియంత్రించాలని వెటర్నరీ అధికారికి సూచించారు. కుక్కలు పట్టి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించాలని కోరారు. పిల్లలను ఒంటరిగా బయటకి పంపొద్దు అని తల్లిదండ్రులకు సూచిస్తూ ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. సోమవారం ఉదయం కుక్కల పట్టే బృందం న్యూ శాయం పేటను జల్లడ పట్టి వీధి కుక్కలను పట్టుకున్నారు.



## ప్రభుత్వ పాఠశాల రూపురేఖలను మారుస్తా: కార్పొరేటర్ తోకల

**రాజేంద్రనగర్ మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ప్రైమరీ స్కూల్ లో అభివృద్ధి పనులలో భాగంగా మౌలిక సదుపాయాలు ప్రహరీ గోడ నిర్మాణం కోసం బిజెపి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు త్రాగునీరు వాష్రూమ్స్, వసతులను అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. స్కూల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి ఇంకా ఎలాంటి సమస్యలు ఉన్నాయో వారిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల లో విద్యార్థులు కావలసిన పౌష్టిక ఆహారంతో పాటు క్రీడా ప్రాంగణం తదితరు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వీలైనంత త్వరగా చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తో కలిసి మాట్లాడి స్పెషల్ ఫండ్ రిలీజ్ చేయించి స్కూల్ రూపురేఖలు మార్చే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది , స్థానికులు మన్మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చిన్న, సోమ గణేష్ , శంకర్ రెడ్డి, జిహెచ్ఎంసి సిబ్బంది వర్కి ఇన్స్పెక్టర్ రాహుల్, శేఖర్ , సంగీత, రామ్కీ సిబ్బంది, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధతతో ప్రజా సమస్యలను పరిష్కరించాలి

### టౌన్ ప్లానింగ్, శానిటేషన్ పై అసహనం వ్యక్తం చేసిన బల్దియా కమీషనర్



**వరంగల్ మహా;** బల్దియా అధికారులు నిబద్ధతతో ప్రజావాణిలో స్వీకరించిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారం కోసం విభాగాల వారీగా వచ్చిన మొత్తం 98 ఫిర్యాదులను ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది విభాగానికి చెందిన ఫిర్యాదులను పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆక్రమణలు,సెట్ బ్యాక్ లేకుండా చేపట్టిన ఇంటి నిర్మాణాలు, ముఖ్యంగా నగరంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న వాటిపై ఫిర్యాదులు అందుతున్న పట్టించుకోవడం లేదని వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించడం లేదని ఈ అంశాల పై కమిషనర్ గా నేను ప్రస్తావించినప్పుడే మీరు చేస్తామని చెబుతున్నారే కానీ టౌన్ ప్లానింగ్ అధికారులు, టీపీఓలు ఫిర్యాదుల పై సరైన రీతిలో స్పందించడం లేదని కమిషనర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శానిటేషన్ అధికారుల పర్యవేక్షణలో చెత్త తీసుకువెళ్లే ఆటోలు, ట్రాక్టర్లు 66 డివిజన్ల లోని ప్రతి కాలనీకి వెళ్లాలని వాటికి జియో టాకింగ్ ఆన్లైన్ తప్పనిసరి చేయాలని సూచించారు. ముఖ్యంగా నగరంలో శానిటేషన్ పూర్తిస్థాయిలో జరగడంలేదని శానిటేషన్ సూపర్వైజర్లు ఇన్స్పెక్టర్ ల తో పాటు జవాన్లు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ ఈ సత్యనారాయణ, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య, ఎం హెచ్ ఓ డా.రాజేష్ పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో టీయూడబ్ల్యూజే ఘన విజయం

### గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టుల సంబురాలు




**హన్మకొండ మహా;** ఎంతో ఉత్కంఠ భరితంగా, హోరా హోరీగా జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నికల్లో టీయుడబ్ల్యూజే మద్దతుతో పోటీ చేసిన ఫ్రెండ్స్ ప్యానెల్ అఖండ మెజారిటీతో ఘన విజయం సాధించింది. దీంతో హనుమకొండ బాలసముద్రం లోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రెస్ క్లబ్ బాధ్యులు సంబురాలు జరుపుకున్నారు. ప్రెస్ క్లబ్ ఆవరణలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసుకుని హైదరాబాద్ లో ఐజేయూ విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఐజేయూ ఘన విజయానికి ఎంతో కృషి చేసి ప్యానల్ ను గెలిపించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో విషసర్పాలన్నీ ఏకమై, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, చారిత్రాత్మక తీర్పుతో చెంపపెట్టు లాంటి సమాధానం చెప్పి, ఫ్రెండ్స్ ప్యానెల్ మొత్తాన్ని అనూహ్య మెజారిటీతో గెలిపించిన హైదరాబాద్ జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. టీయూడబ్ల్యూజే పట్ల ఉన్న విశ్వాసాన్ని, అభిమానాన్ని చాటుకున్న హైదరాబాద్ జర్నలిస్టులకు వారు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్ క్లబ్ సభ్యుల విశ్వాసాన్ని వమ్ముచేయకుండా, వారి రుణాన్ని తీర్చుకోడానికి నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, పెండెం వేణుమాధవ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు పివి. మదన్ మోహన్, గడ్డం కేశవమూర్తి, పిన్నా శివ కుమార్, యూనియన్ నాయకులు సిహెచ్ సోమ నర్సయ్య,కెంచ కుమారస్వామి, మాదం రజనీకుమార్, డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్ధన్, సాయిరాం, యాంసాని శ్రీనివాస్, మంచాల రాజు, ముదిగిరి ఓదెలు, అల్లె రామారావు, రామ్మోహన్, సంపత్ ప్రభాకర్, తాండూరి గోపి, కొమ్మాలు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ అధికారులు సమస్యలను పరిష్కరించాలి

### కార్పొరేటర్ మరుపల్ల రవి

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 40వ డివిజన్ లో పలుచోట్ల తుప్పు పట్టిన ఇనుప కరెంటు స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న సిమెంటు కరెంటు స్తంభాలు ప్రజల ప్రాణాలకు ఉప్పు వాటిల్లే విధంగా మారాయి. వాటిని వెంటనే తొలగించి నూతన స్తంభాలను 15 రోజుల్లో గా ఏర్పాటు చేయకపోతే సబ్ స్టేషన్ల ముందు ఆందోళన చేపడతామని 40 వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి హెచ్చరించారు. సోమవారం కరీమాబాదులోని సబ్ స్టేషన్ కార్యాలయంలో ఏ డి ఈ పాలడుగుల చంద్రమౌళి, ఏఈ దేవర సంపత్ లకు కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల తో కలిసి సమస్యల పై వినతిపత్రం అందజేశారు. కొంతకాలంగా డివిజన్లో తరచుగా కరెంటు నిలిచిపోవడం అనేక ప్రాంతాలలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయని ఎన్నో ఏళ్ల క్రితం వేసిన ఇనుప స్థంబాలు, తుప్పు పట్టినవని కొన్ని సిమెంటు స్తంభాలు శిథిలావస్థలో ఉన్న కారణంగా లోవోల్టేజి వల్ల ఇంటిలోని కరెంటు సంబంధించిన వస్తువులను పాడైపోతున్నాయని నూతనంగా కొత్త ట్రాన్స్పార్మర్లు ఏర్పాటు చేయాలని గతంలో ఎలక్ట్రికల్ అధికారులకు తెలిపినప్పటికీ అధికారులు తూతూ మంత్రంగా నాలుగు కరెంటు పోల్స్ ను వేసి ఆందోళన చేయకుండా సమస్యను సద్దుమణిగేలా చేశారని ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని మరుపల్ల రవి వారికి సూచించారు.

## పట్నం చెరువు కట్టను పరిశీలించిన ఎమ్మెల్యే

- త్వరలో చెర్వుకట్ట సుందరీకరణ పనులు ప్రారంభం
- సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ
- నియోజకవర్గ అభివృద్దే నా ధ్యేయం.. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వెల్లడి



**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకట్ట సుందరీకరణ పై సోమవారం పలు శాఖల అధికారులతో కలిసి, చెరువుకట్టను, ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పరిశీలించారు. అనంతమైన మాట్లాడుతూ...రానున్న రోజుల్లో ఇబ్రహీంపట్నం చెర్వుకట్ట రూపు రేకలు మారుతాయని, రూ.18 కోట్ల వ్యయంతో చెరువు కట్ట సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అస్తవ్యస్తంగా ఉన్న ఇబ్రహీంపట్నం చౌరస్తా, వాహనదారులకు ఇబ్బందికరంగా నెలకొంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్న కారణంగా, ప్రణాళిక ప్రకారం చౌరస్తా ఏర్పాటు చేపట్టడం జరుగుతుందని, అలాగే ఇబ్రహీంపట్నం అంబేఢ్కర్ చౌరస్తా నుంచి నాగంపల్లి గ్రామం వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో వందలాది కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని, రాబోయే రోజులలో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడం, ఎమ్మెల్యేగా తన బాధ్యత అని వెల్లడించారు. ఇబ్రహీంపట్నం చెరువు కట్ట పైన జరుగుతున్న ప్రమాదాలను నివారించే క్రమంలో, త్వరలో ఉప్పరిగూడ కూడలిలో అండర్ పాస్ లేదా ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ...**

సోమవారం ఇబ్రహీంపట్నం ప్రజా భవన్ (క్యాంపు ఆఫీస్)లో యాచారం మండలానికి సంబంధించిన 69 మంది లబ్దిదారులకు, 69 లక్షల 8 వేల రూపాయల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్, ఆర్&బీ ఎస్ఈ రవిశంకర్, హెచ్ఎండిఏ ఈఈ రజిత, ఈఈ మహబూబ్ మియా, పిఆర్ ఈఈ సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్య నారాయణ రెడ్డి, ఎమ్మార్వో సునితా రెడ్డి, ఏసీపీ కేపివి రాజు, ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్, సీఐ మహేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, నాయకులు ఈసి శేఖర్ మామ, ముత్యాల రాజశేఖర్ రావు, మంకాల దాసు, ఏఎంసి వైస్ కరుణాకర్, డైరెక్టర్ లు కర్ణాకర్ రెడ్డి, రాజు, మాజీ కౌన్సిలర్లు నీళ్ల భాను, పలు శాఖల అధికారులు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో 249 మద్యం షాపులకు లాటరీ పద్ధతి ద్వారా కేటాయింపులు పూర్తి

### జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి 2025 2027 సంవత్సరాలకు రంగారెడ్డి జిల్లాలో మొత్తం 249 మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి లాటరి పద్ధతి ద్వారా పూర్తి పారదర్శకంగా కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం శంషాబాద్ లోని మల్లికా కన్వెన్షన్ హాల్ లో సరూర్ నగర్ యూనిట్ 138 మద్యం దుకాణాలు ,శంషాబాద్ 111 మద్యం దుకాణాల ఎంపిక కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ్ రెడ్డి హాజరై సరూర్ నగర్ యూనిట్ 138 లాటరీ పద్ధతి ద్వారా మద్యం దుకాణాలను కేటాయించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ శంషాబాద్ యూనిట్ 111 లాటరీ పద్ధతి ద్వారా మద్యం దుకాణాలను కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పూర్తి పారదర్శకతతో మద్యం దుకాణాల లాటరీ పద్ధతి ద్వారా నిర్వహించడం జరిగినదన్నారు. రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ యూనిట్ పరిధిలో మొత్తం 249 A4 షాపులు ఉండగా, అందులో సరూర్ నగర్ ఎక్సైజ్ యూనిట్ 138 మద్యం దుకాణాలకు సంబంధించి 7,845, శంషాబాద్ ఎక్సైజ్ యూనిట్ 111 మద్యం దుకాణాలకు సంబంధించి 8,536 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లాలోని మద్యం షాపులను పారదర్శకంగా లాటరీ ద్వారా ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ అబ్కారీ శాఖాధికారి ఉజ్వల రెడ్డి, శంషాబాద్ అబ్కారీ శాఖాధికారి కృష్ణప్రియ పర్యవేక్షణలో మద్యం దుకాణాల ఎంపిక జరిగింది.

# శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో వలస కార్మికుడు మృతి...!

## గుట్టు చప్పుడు మృతదేహాన్ని తరలించే యత్నం..

## అడ్డుకున్న పోలీసులు...

- కళాశాల ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా...
- మృతుడి కుటుంబానికి 20 లక్షల పరిహారం ఇవ్వాలి
- సిఐటియు నాయకులు అరెస్టు చేసిన పోలీసులు
- అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు... పోరాటం ఉధృతం చేస్తాం
- ఇబ్రహీంపట్నం సిఐటియు కన్వీనర్ ఎల్లేశా..






**రంగారెడ్డి జిల్లా మహా:** శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దివాకర్ బాత్ర అనే వలస కార్మికుడు మృతి చెందడంతో, కార్మికుడి మృతి పట్ల కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వహించగా, సోమవారం సిఐటియు కన్వీనర్ చింతపట్ల ఎల్లేశా ఆధ్వర్యంలో వలస కార్మికుడి కుటుంబానికి న్యాయం జరగాలంటూ కళాశాల ముందు ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో భారీగా మోహరించిన పోలీసులు, సిఐటియు నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. వలస కార్మికుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో జరుగుతున్న, నూతన భవన నిర్మాణ పనుల్లో భాగంగా, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు దివాకర్ బత్ర, భవనం పైనుంచి పడి మృతి చెందిన ఘటన ఈనెల 25వ తారీఖున, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.

**గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని తరలించే ప్రయత్నం....**

కళాశాల యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా మృతుడి స్వస్థలానికి మృతదేహాన్ని తరలించే ప్రయత్నంలో, విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు, మార్గ మధ్యలో అడ్డుకొని, దివాకర్ బత్ర మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం సర్కార్ దవాఖానకు తరలించి పోస్టుమార్టం చేయించడం జరిగింది.

**మృతుడి కుటుంబానికి బాసటగా నిలిచిన సిఐటియు నాయకులు....**

సిఐటియు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కన్వీనర్ చింతపట్ల ఎల్లేశా, భవన నిర్మాణ కార్మికుడి మృతి పట్ల సంతాపం తెలియజేసి, బాసటగా నిలిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఇబ్రహీంపట్నం మండలం, శేరిగూడ గ్రామంలోని శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దివాకర్ బత్ర, తన తమ్ముడు ఇద్దరు కలిసి రెండు నెలలుగా భవన నిర్మాణంలో పని చేస్తున్నారు. కళాశాలలో, అంతర్రాష్ట్ర వలస కార్మికుడు చనిపోతే, భవన నిర్మాణ కాంట్రాక్టర్, యాజమాన్యం కుమ్మక్కై ఏలాంటి నష్టపరిహారం చెల్లించకుండా, మృతుడి కుటుంబాన్ని బెదిరించి, గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని తరలించే ప్రయత్నం చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. కళాశాల యాజమాన్యం, కాంట్రాక్టర్ మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని, 20 లక్షల పరిహారం కుటుంబానికి అందించాలని, సిఐటియు మున్సిపల్ కన్వీనర్ ఆధ్వర్యంలో డిమాండ్ చేయడం జరిగిందని, దానికి యాజమాన్యం నిరాకరించడంతో కళాశాల ముందు ధర్నా చేపట్టడం జరిగిందని ఆయన వెల్లడించారు. కళాశాల యాజమాన్యం మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించలేని పక్షంలో 200 మంది భవన నిర్మాణ కార్మికులతో పోరాటం ఉధృతం చేస్తామని, కళాశాల యాజమాన్యాన్ని హెచ్చరించారు.

**చట్టపరమైన చర్యలు తీసుకోవాలి...**

చనిపోయిన కార్మికుడి మృతదేహాన్ని గుట్టు చప్పుడు కాకుండా తరలించే ప్రయత్నం చేసిన శ్రీఇందు కళాశాల యాజమాన్యంపై, ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సర్కారు అనుమతులు లేకుండా అక్రమంగా భవన నిర్మాణం కొనసాగుతుందని, సిఐటియు కన్వీనర్ ఆరోపిస్తూ, భవనంపై చట్టపరమైనా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు యాదగిరి, భవన నిర్మాణ సంఘం కార్యదర్శి బొస్పలి రాజు, కోశాధికారి కొంగర జంగయ్య, జంగయ్య, అంకమరావు, తదితరులు పాల్గొన్నారు.

# కంది శ్రీనివాస రెడ్డికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరామర్శ






**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డిని, ఆయన బావమరిది కుటుంబ సభ్యులను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరామర్శించారు. ఆదివారం కంది శ్రీనివాస రెడ్డి బావమరిది గడ్డం అఖిల్ రెడ్డి గుండె పోటుతో మృతిచెందడంతో ఎమ్మెల్యే సోమవారం బేల మండలం సిర్సన్న గ్రామంలోని అతని నివాసాన్ని సందర్శించారు. అఖిల్ చిత్ర పటం వద్ద పుష్పాంజలి ఘటించి సంతాపం ప్రకటించారు. చిన్నవయసులో గుండె పోటుతో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. కంది శ్రీనివాస రెడ్డి తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు.ఆయనతో పాటు స్థానిక బీజేపీ నాయకులున్నారు.





# కంది శ్రీనివాస రెడ్డికి మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డిని, ఆయన బావమరిది కుటుంబ సభ్యులను మాజీ మంత్రి నిర్మల్ కు చెందిన అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి,బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు పరామర్శించారు. ఆదివారం కంది శ్రీనివాస రెడ్డి బావమరిది గడ్డం అఖిల్ రెడ్డి గుండె పోటుతో మృతిచెందడంతో మాజీ మంత్రి ఐకెరెడ్డి సోమవారం బేల మండలం సిర్సన్న గ్రామంలోని కంది శ్రీనివాస రెడ్డి మామ గడ్డం రమేష్ రెడ్డి నివాసాన్ని సందర్శించారు. అఖిల్ చిత్ర పటం వద్ద పుష్పాంజలి ఘటించి సంతాపం ప్రకటించారు. చిన్నవయసులో గుండె పోటుతో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. కంది శ్రీనివాస రెడ్డి తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు.ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి ,గిమ్మ సంతోష్ రావు, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి,పాకాల రాంచందర్ , బోరంచు శ్రీకాంత్ రెడ్డి తదితరులున్నారు.

## హసీనా బహిష్కరిస్తే.. యూనస్ ఆహ్వానించారు!

**ఢాకా:** బంగ్లాదేశ్‌లోని ముహమ్మద్ యూనస్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఏడేళ్ల క్రితం అప్పటి హసీనా సర్కారు ఇస్లామిక్ ప్రచారకుడు జకీర్ నాయక్‌కు బంగ్లాదేశ్‌లోకి ఎప్పటికీ ప్రవేశం లభించదని ప్రకటించగా దీనికి భిన్నంగా యూనస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నవంబర్ 2829 తేదీలలో ఢాకాలో జరిగే ఛారిటీ కార్యక్రమానికి జకీర్ నాయక్‌కు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆహ్వానం పలికింది. వివాదాస్పద ఇస్లామిక్ ప్రచారకర్త జకీర్ నాయక్‌పై భారతదేశంలో మనీలాండరింగ్‌తో పాటు పలు విద్వేషపూరిత ప్రసంగాలు చేశారనే ఆరోపణలున్నాయి. ఇదేవిధంగా జకీర్ నాయక్‌కు బంగ్లాదేశ్‌లోకి ప్రవేశం లేదని ప్రకటించిన బంగ్లాదేశ్ ఇప్పుడు ఏడేళ్ల తర్వాత తన నిర్ణయం మార్చుకోవడం వివాదాస్పదంగా మారింది. 2016, జూలైలో రాజధాని ఢాకాలోని 'హోలీ ఆర్టిసన్ బేకరీ కేఫ్' పై దాడి వెనుక జకీర్ నాయక్ ప్రమేయం ఉందనే ఆరోపణలు వినిపించాయి. ఈ దాడిలో పాల్గొన్న ఇద్దరు ఉగ్రవాదులు.. జకీర్ నాయక్ బోధనలతో ప్రేరణ పొందారనే వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలోనే అప్పటి ప్రభుత్వం జకీర్ నాయక్‌ను బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించకుండా నిషేధించింది. భారతదేశంలోని జాతీయ దర్యాప్తు సంస్థ కూడా అతనిపై ఉగ్రవాదం, మనీలాండరింగ్ తదితర ఆరోపణల కింద దర్యాప్తు చేస్తోంది. ఢాకాలో ఉగ్రవాద దాడి తర్వాత అతను ఆ దేశం నుంచి పరారయ్యాడు. ప్రస్తుతం మలేషియాలో తలదాచుకున్న జకీర్ నాయక్ స్పార్క్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వహించే ఛారిటీ కార్యక్రమంలో పాల్గొనేందుకు నవంబర్ 28 29 తేదీలలో బంగ్లాదేశ్‌కు రానున్నారు. ఈ కార్యక్రమం ఢాకాలోని అగర్గావ్ ప్రాంతంలో జరగనుంది. వివిధ మత సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించారనే ఆరోపణలతో 2016లో ఎన్ఐఏ తొలిసారిగా ఉగ్రవాద నిరోధక చట్టాల కింద జకీర్ నాయక్‌పై కేసు నమోదు చేసింది. 60 ఏళ్ల జకీర్ నాయక్ 2016లో భారతదేశం నుండి మలేషియాకు వెళ్లి, అక్కడ శాశ్వత నివాస హోదాను పొందాడు.తనపై సాగుతున్నఅన్యాయమైన విచారణ నుండి సురక్షితంగా బయటపడేవరకూ తాను భారతదేశానికి తిరిగి రానని జకీర్ నాయక్ గతంలో వెల్లడించారు. కాగా తమ దేశంలో సమస్యలు సృష్టించనంత వరకు జకీర్ నాయక్‌ను బహిష్కరించలేమని, భారత్‌కు పంపే ప్రసక్తే లేదని మలేషియా ప్రభుత్వం తెలిపింది.

# మద్యం దుకాణాల లక్కీ డ్రా




**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియను సోమవారం స్థానిక రత్న గార్డెన్‌లో జిల్లా కలెక్టర్ రాజార్షి షా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కే. రఘు రామ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ లతో కలిసి పారదర్శకంగా నిర్వహించారు. ఎక్సైజ్ పాలసీ (2025-2027) ప్రకారం మొత్తం 40 మద్యం షాపుల కేటాయింపులో, 34 షాపులు లక్కీ డ్రా ద్వారా కేటాయించబడినట్టు కలెక్టర్ తెలిపారు. 10 కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన 6 షాపులకు డ్రా నిర్వహించకుండ, వాటి కోసం మళ్లీ రీటెండర్ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి షాపుకు సంబంధించిన దరఖాస్తుల ఆధారంగా టోకెన్ నంబర్లు కేటాయించి, దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ స్వయంగా లక్కీ డ్రా నిర్వహించారు. డ్రా ప్రారంభం నుంచి ముగింపు వరకు మొత్తం ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ఫోటో, వీడియో రికార్డింగ్ ద్వారా నిర్వహించారు.లక్కీ డ్రాలో ఎంపికైన వారికి లైసెన్స్ ఫీజు చెల్లింపునకు అవసరమైన సదుపాయాలను వేదిక వద్దనే కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ..

### సత్వర పరిష్కారం.. అధికారులకు ఆదేశాలు

### జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా అధికారులు సత్వరపరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (56) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లలో ప్రతిష్టంభన

### 12 శాతం కంటే తేమ ఎక్కువున్న పత్తి కొనుగోలుకు సీసీఐ నిరాకరణ

### కాసేపు నిలిచిపోయిన కొనుగోళ్లు.. రైతుల ఆందోళన

### కలెక్టర్ చొరవతో తేమ ఎక్కువున్న పత్తి కొనుగోలుకు ప్రైవేటు వ్యాపారులు పై తిరిగి కొనసాగిన కొనుగోళ్లు



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్లో నేటి నుంచి పత్తి పంట కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. సీసీఐ అధికారులు క్వింటాలు పత్తి ధర రూ.8110గా నిర్ణయించారు. తొలిరోజు కావడంతో రైతులు పెద్ద ఎత్తున మార్కెట్ కు తమ పంటను తెచ్చారు. అయితే 12 శాతం కంటే తేమ ఎక్కువున్న పత్తిని సీసీఐ అధికారులు కొనుగోలు చేయకపోవడంతో కాసేపు కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రైతులు రైతు సంఘాలు ఆందోళన నిర్వహించారు. ఈ సారి జిల్లాలో అధిక వర్షాపాతం నమోదైందని కాబట్టి పత్తిలో తేమ శాతంపెరిగిందని తేమ తో సంబంధం లేకుండా మార్కెట్ కొచ్చిన పంటనంతా కొనాలని డిమాండ్ చేసారు.అంతేకాక కపాస్ కిసాన్ యాప్ తో సంబంధం లేకుండా కొనుగోలు చేపట్టాలని రైతులు కోరారు. జిల్లాలో మార్కెట్ యార్డ్ పరిధిలో మొత్తం 17 ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. రైతుల సమస్యలపై అధికారులు, మిల్లుల యజమానులు, రైతులు కలిసి రెండు గంటల పాటు చర్చించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. 12 శాతం తేమ కలిగిన పత్తిని నేరుగా సీసీఐ కొనుగోలు చేస్తుందని, 12 శాతం పైగా తేమ ఉన్న పత్తిని మాత్రం సోమవారం మాత్రమే ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులు రూ.6,950 ధరకు కొనుగోలు చేస్తాయని తెలిపారు. దీంతో తిరిగి కొనుగోళ్లు కొనసాగాయి.రైతుల సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం పలు ఏర్పాట్లు చేపట్టిందని, వర్ష సూచన ఉన్న నేపథ్యంలో రైతులు పత్తిని తగిన రక్షణ చర్యలతో మార్కెట్ కు తీసుకురావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రైతుల కోసం మార్కెట్ యార్డ్ లో భోజన వసతి కూడా ఏర్పాటు చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ,రాష్ట్ర సీడ్స్ నోడల్ అధికారి కేశవులు, మార్కెటింగ్ ఏడీ గజానంద్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేపై మాజీ మంత్రి విమర్శలు

**నిర్మల్ మహా:** నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పై మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. సోమవారం నిర్మల్ లోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిర్మల్ ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం నిర్మల్ అభివృద్ధి నిరోధకడిగా మహేశ్వర్ రెడ్డి మారిపోయారన్నారు. గతంలో మంజూరైన మెడికల్, నర్సింగ్ కాలేజీల నిర్మాణాలను బీజేఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. కాంట్రాక్టర్లను కమిషన్ల పేరుతో వేధిస్తూ పనులను జరగకుండా చూస్తున్నారని పేర్కొన్నారు. తాను ఏ పార్టీలో చేరడం లేదని హైదరాబాద్లోని భాగ్యలక్ష్మి ఆలయంలో పూజలు చేయడంపై బిజెపి లో చేరుతున్నారా అని అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అదేవిధంగా రాబోయే రెండు సంవత్సరాల్లో రాజకీయాల్లో పెను మార్పులు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో కులగణన నిర్వహించే అవకాశం ఉండడంతో రిజర్వేషన్లు మారిపోయే ఆస్కారం ఉందన్నారు. తనకు ఎమ్మెల్యే, ఎంపీ పదవులపై ఆశ లేదని ఏడుసార్లు సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఐకెరెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** నూతన మద్యం పాలసీ విధానం ప్రకారం లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాలను కేటాయించడం జరిగిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా నస్పూర్ మండలం శ్రీరాంపూర్ లోని పి.వి.ఆర్. గార్డెన్స్ లో లక్కి డ్రా పద్ధతిన మద్యం షాపుల కేటాయింపు లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆబ్కారీ, మద్య నిషేధ శాఖ అధికారి నంద గోపాల్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ విధానం ద్వారా దుకాణాలు కేటాయించడం జరిగిందని వెల్లడించారు. జిల్లాలో మద్యం దుకాణాల కొరకు 1 వేయి 712 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో నుండి 73 దుకాణాలకు లక్కీ డ్రా తీయడం జరిగిందని తెలిపారు. నూతన మద్యం పాలసీ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు తెలిపారు. దుకాణాల వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేయడం జరిగిందని అన్నారు. లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ చేయడం జరిగిందని వివరించారు. టోకెన్ కలిగి ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దుకాణం పొందిన వారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.




## సిమెంట్ బస్తాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

### ఉదారత చాటుకున్న చంద్రన్న సేవా ఫౌండేషన్

**రంగారెడ్డి జిల్లా మహా:** చంద్రన్న సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిమెంట్ బస్తాల పంపిణీ కార్యక్రమానికి, ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సిమెంట్ బస్తాలను పంపిణీ చేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ డొంకని చంద్రయ్య జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు, చంద్రన్న సేవా ఫౌండేషన్ ద్వారా గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, ఒక్కొక్కరికి ఉచితంగా 20 బస్తాల చొప్పున అందించి తమ ఉదారతను చాటుకున్నారని, ఎమ్మెల్యే రంగారెడ్డి, వారి కుటుంబ సభ్యులను అభినందించారు. సేవ చేయాలని ఆలోచన రావడం చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు.

# వర్సిటీ డిగ్రీ ఉంటేనే...!

> సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు.. వీళ్లను ఏమాత్రం తక్కువ చేయడానికి వీల్లేదు. మన దేశంలో 35 నుంచి 45 లక్షల మంది ద్వారా గత ఏడాది కాలంలో రూ.3,500 కోట్ల వ్యాపారం జరిగిందంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. అయితే.. ఇలా అడ్డగోలుగా పుట్టుకొస్తున్న ఇన్‌ఫ్లుయెన్సర్లకు చెక్ పెట్టేందుకు మన పొరుగు దేశం చైనా ఓ అద్భుతమైన ప్రణాళిక అమలు చేయబోతోంది.



ఏదో ఒక వీడియోతో ఓవర్‌నైట్ సెన్సేషన్ అయిపోవడం ఈరోజుల్లో సర్వసాధారణంగా మారింది. అలా భారత్‌లో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు.. ఇంకా పుట్టుకొస్తూనే ఉన్నారు. ఇదే అదనుగా తమ ఉత్పత్తులను ప్రచారం చేయడానికి ఇన్‌ఫ్లుయెన్సర్లను కంపెనీలు ఎక్కువగా ఆశ్రయిస్తున్నాయి. భారత్‌తో పాటు పలు దేశాల్లో వినియోగదారుల కొనుగోలు నిర్ణయాల్లో ఇప్పుడు వాళ్లదే కీలక పాత్ర. పైగా సెలబ్రిటీలకి బదులు తక్కువ బడ్జెట్‌తో ఆ పని చేస్తుండడం కంపెనీలకు కలిసొస్తోంది. ఫ్యాషన్, ఫిట్‌నెస్, ఫుడ్, ఫైనాన్స్, ఎడ్యుకేషన్ వంటి రంగాల్లో విస్తృతంగా కంటెంట్ రూపొందిస్తున్నారు. ఉదాహరణకు.. ఇన్‌స్టాగ్రామ్‌లో బాగా ఫాలోయింగ్ ఉన్న ఓ వ్యక్తి ఓ కంపెనీ పరువులను అదే పనిగా ప్రమోట్ చేయడం!. అయితే ఏఐ జమానాలో.. ప్రజలను తప్పుదోవ పట్టించే కంటెంట్ కూడా అదే స్థాయిలో వ్యాప్తి చెందుతోంది. అందుకే చైనా సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. ఇక నుంచి ప్రొఫెషనల్ విషయాలపై మాట్లాడాలంటే ఇన్‌ఫ్లుయెన్సర్లకు అర్హతలు తప్పనిసరి చేసింది. వైద్యం, ఆర్థికం, న్యాయం, విద్య వంటి సున్నితమైన రంగాల్లో కంటెంట్ రూపొందించే ముందు ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ విద్యా అర్హతలు, శిక్షణ పత్రాలు లేకుంటే ప్రొఫెషనల్ అనుభవాన్ని చూపించాల్సి ఉంటుంది. అక్కడి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు (ఉదాహరణకు.. Douyin, Weibo, Bilibili వంటి ప్రముఖ ప్లాట్‌ఫారమ్‌లు) ఈ అర్హతలనూ ధృవీకరించాల్సి ఉంటుంది. అలా చేయకుంటే.. ఇన్‌ఫ్లుయెన్సర్ల సో.మీ. అకౌంట్లను నిలిపివేయడమే కాదు.. శాశ్వత నిషేధం విధించే అవకాశం లేకపోలేదు. అలాగే.. 100,000 యువాన్ (₹11 లక్షల వరకు) జరిమానా విధించబడుతుంది. చైనా సైబర్‌స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (CAC) ఈ నూతన నిబంధనలు తీసుకొచ్చింది. ఈ రూల్స్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్లు లగ్జరీ లైఫ్‌స్టైల్‌ను ప్రదర్శించడంపై కూడా నిషేధం. ఇన్‌ఫ్లుయెన్సర్ల వ్యక్తిగత అకౌంట్లు మాత్రమే కాదు.. వాళ్లు నిర్వహించే మల్టీచానల్ నెట్‌వర్క్ (MCN)లకు కూడా ఈ కొత్త నిబంధనలు వర్తిస్తాయి. ఈ సంస్థలు తమ టాలెంట్‌ను రాజకీయంగా, ప్రొఫెషనల్‌గా సమర్థవంతంగా పర్యవేక్షించాల్సి ఉంటుంది. అదే సమయంలో.. కంపెనీ బ్రాండ్లు కూడా ఇన్‌ఫ్లుయెన్సర్ల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. కంపెనీలు లేదంటే సో.మీ. ప్లాట్‌ఫారమ్‌లు ఏఐ ద్వారా రూపొందించిన కంటెంట్‌ను స్పష్టంగా లేబుల్ చేయాలి. ఈ లేబుల్‌స్‌ను తొలగించడం లేదంటే తారుమారు చేయడం కఠినమైన నేరంగా పరిగణిస్తారు. లేబులింగ్ ఉల్లంఘనలకు భారీ జరిమానాలు విధిస్తారు.

**భారత్‌లో ఇలా..**

భారత్‌లో చైనా తరహా కఠిన నిబంధనలు (అర్హతల ధృవీకరణ, ప్లాట్‌ఫారమ్‌లపై బాధ్యత, భారీ జరిమానాలు) అమల్లో లేవు. కానీ.. స్పాన్సర్డ్ కంటెంట్‌కి డిస్క్లోజర్ తప్పనిసరిగా ఉంది. అంటే.. ఏఎస్‌సీఐ (Advertising Standards Council of India) ప్రకారం, #ad, #sponsored వంటి ట్యాగ్‌లు తప్పనిసరిగా ఉండాలి. అలాగే తప్పుదారి పట్టించే ప్రకటనలు చేస్తే, ఇన్‌ఫ్లుయెన్సర్‌తో పాటు బ్రాండ్ కూడా Consumer Protection Act (CCPA) ప్రకారం బాధ్యత వహించాలి. ఈ ఏడాదిలో ఏర్పాటైన ఇండియన్ ఇన్‌ఫ్లుయెన్సర్ గవర్నెన్స్ కౌన్సిల్ (IIGC).. నైతిక ప్రమాణాలు, కంటెంట్ నైతికత, వినియోగదారుల హక్కులు వంటి అంశాలపై మార్గదర్శకాలు రూపొందిస్తోంది. అయితే.. ఏఐ ఆధారిత కంటెంట్ పెరుగుతున్న నేపథ్యంలో.. భారత్‌సహా ఇతర దేశాలు కూడా చైనా విధించిన నిబంధనలను పరిశీలించే అవకాశం ఉంది. స్వేచ్ఛా భావప్రకటనకు ఇది అడ్డంకిగా మారుతుందన్న విమర్శలు ఉన్నప్పటికీ, ప్రజల విశ్వాసాన్ని కాపాడేందుకు ఇది అవసరమన్న వాదనలు కూడా ఉన్నాయి.

### ప్రజావాణి దరఖాస్తులను

# క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య



**మంచిర్యాల, మహా :** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన మంచిర్యాల ఆర్డీఓ అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ, సూర్యనగర్ కాలనీ వాసులు గత కొద్ది రోజులుగా తమ కాలనీకి తాగునీరు రావడం లేదని దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన భూపతి జగన్ మోహన్ తన తండ్రి పేరిట గల భూమిని ఆయన మరణించినందున తన పేరిట నిరాసత్ పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల మండలం వేంపల్లి గ్రామానికి చెందిన రాయిలి సత్యం తాను తన భూమి హద్దుగా కొలత కొరకు దరఖాస్తు చేసుకున్నానని, సర్వే చేయించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామానికి చెందిన నేతుల సత్తయ్య తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన జె బాలక్క, ఎస్.సి. కాలానికి చెందిన ఎన్.లక్ష్మి, భూపెల్లి లావణ్యలు తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. బెల్లంపల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రతినిధులు తమ దరఖాస్తులో సేంద్రీయ ఉత్పత్తుల అవుట్ లెట్ కొరకు స్థలం కేటాయించాలని కోరారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి కిష్టయ్య తన కుమారుడు తన భూములు లాక్కొని ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో శ్రీచైతన్య పాఠశాల సీజ్

**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నంలో పెట్రోల్ బంకును ఆనుకొని ప్రమాదకరంగా నిర్వహిస్తున్న, శ్రీచైతన్య పాఠశాలను, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో, మండల విద్యాధికారి సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న, శ్రీచైతన్య పాఠశాల, పక్కనే ఉన్న పెట్రోల్ బంకుకు ఆనుకొని ఉండడంతో, ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే వందలాది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు పలుమార్లు, మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికి ఏలాంటి చర్యలు లేకపోవడంతో, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు, స్పందించిన మండల విద్యాధికారి హిర్యా నాయక్, సోమవారం సాయంత్రం శ్రీచైతన్య పాఠశాలను సీజ్ చేశారు.



# మీసాల పిల్ల..
## యూట్యూబ్‌లో ఇప్పుడిదే ట్రెండింగే పిల్లా!

హిట్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ ఏడాది పొంగల్‌కు సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ విజయం అందుకున్నాడు. వచ్చే ఏడాది సంక్రాంతికి మన శంకరవరప్రసాద్‌గారు మూవీతో బ్లాక్‌బస్టర్ అందుకునేందుకు సిద్ధమవుతున్నాడు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో గోదారి గట్టు మీద రామచిలకవే.. పాట ఎంత వైరలయిందో ఇప్పుడు చిరంజీవి మూవీ (Mana Shankaravaraprasad Garu Movie) లోని మీసాల పిల్ల కూడా అంతే వైరలవుతోంది.

### 36 మిలియన్ల వ్యూస్

(Meesaala Pilla Song) యూట్యూబ్‌లో టాప్‌లో దూసుకుపోతోంది. 13 రోజులుగా ఫస్ట్ ప్లేస్‌లో ట్రెండ్ అవుతోంది. ఇప్పటివరకు 36 మిలియన్ల వ్యూస్ అందుకుంది. ఈ సాంగ్‌లో చిరు వేసే స్టెప్పులు సింపుల్‌గా కనిపిస్తూనే చాలా స్టైలిష్‌గా ఉంటాయి. లిరికల్ సాంగ్‌కే ఈ రేంజ్‌లో రెస్పాన్స్ వస్తే ఇక వీడియో సాంగ్ రిలీజ్ చేస్తే ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందో!

### సినిమా

భీమ్స్ సంగీతం అందించిన మీసాల పిల్ల పాటను ఉదిత్ నారాయణ్, శ్వేత మోహన్ ఆలపించారు. భాస్కరభట్ల రవికుమార్ లిరిక్స్ రాశాడు. పోలకి మాస్టర్ కొరియోగ్రాఫీ చేశాడు. మన శంకరవరప్రసాద్‌గారు సినిమా విషయానికి వస్తే.. చిరంజీవి, నయనతార జంటగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు.

# విడాకులకు సిద్ధమైన జంట!

పెళ్లి అనేది మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతోంది. భార్యాభర్తలు అంటే ఇలా ఉండాలి అని ఆదర్శంగా కనిపించే జంటలు కూడా చివరకు విడాకుల బాటలో పయనిస్తుండటం కొంత షాకింగ్‌గానే ఉంది. తాజాగా బుల్లితెర జంట జే భానుషాలి-మహి విజ్ విడాకులు తీసుకోబోతున్నారంటూ ప్రచారం ఊపందుకుంది. 14 ఏళ్ల దాంపత్యానికి ముగింపు పలకాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

### మీకెందుకు చెప్పాలి?

ఈ మేరకు కొద్ది నెలల క్రితమే విడాకులకు దరఖాస్తు చేశారట! ముగ్గురు పిల్లల్ని పంచుకోనున్నారట! గతంలోనూ ఈ దంపతులు విడిపోతున్నట్లు ప్రచారం జరిగింది. అప్పుడు మహి స్పందిస్తూ.. ఒకవేళ నిజంగా విడిపోయినా మీకెందుకు చెప్పాలి? మీరేమైనా నా చుట్టాలా? లాయర్ ఫీజు కడతారా? ఛాన్స్ దొరికిందని ఎవరినో ఒకర్ని నిందించడం తప్ప ఏమీ చేయరు అని సీరియస్ అయింది.

### బుల్లితెర జంట

మహి.. 2004లో వచ్చిన తెలుగు మూవీ తపనలో హీరోయిన్‌గా నటించింది. మలయాళం, కన్నడ భాషల్లో ఒక్కో సినిమా చేసింది. వెండితెరను నమ్ముకోకుండా బుల్లితెరపైనే సెటిల్ అయిపోయింది. హిందీలో అనేక సీరియల్స్ చేసింది. జే భానుషాలి హేట్ స్టోరీ 2ల, దేసి కట్టే, ఏక్ పహేలీ లీలా సినిమాలు చేశాడు. బుల్లితెరపై పలు సీరియల్స్ చేశాడు. జే భానుషాలి, మహి 2011లో పెళ్లి చేసుకున్నారు. పెళ్లి తర్వాత వీరిద్దరూ జంటగా నాచ్ బలియే సీజన్ 5లో పాల్గొని ట్రోఫీ గెలిచారు.

### ఐవీఎఫ్ ప్రయత్నాలు

జే.. హిందీ బిగ్‌బాస్ 15వ సీజన్‌లోనూ పాల్గొన్నాడు. సింగింగ్, డ్యాన్సింగ్ షోలకు యాంకరింగ్ చేస్తుంటాడు. జే- మహిలకు పెళ్లయిన తర్వాత చాలా ఏళ్లవరకు సంతానం కలగలేదు. దీంతో బాబు రాజ్‌వీర్, పాప ఖుషిలను 2017లో దత్తత తీసుకున్నారు. అప్పటికీ సంతానం కోసం ప్రయత్నించే క్రమంలో మూడుసార్లు ఐవీఎఫ్ ఫెయిలవగా నాలుగోసారికి సక్సెస్ అయింది. 2019లో ఐవీఎఫ్ ద్వారా కూతురు తార జన్మించింది.




బైసన్ మూవీకి రివ్యూ ఇచ్చిన సీఎం..
# పిలిచి మరీ అభినందనలు



మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ధ్రువ్‌విక్రమ్ కథానాయకుడిగా నటించిన చిత్రం బైసన్. అనుపమ పరమేశ్వరన్, రజీషా విజయన్, పశుపతి తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని అప్లాస్ సంస్థతో కలిసి నీలం ప్రొడక్షన్స్ పతాకంపై దర్శకుడు పా.రంజిత్ నిర్మించారు. నివాస్ కే ప్రసన్న సంగీతాన్ని అందించిన ఈ చిత్రం తమిళనాడులో అక్టోబర్ 17న విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. బైసన్ మూవీ చూసిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్.. ఆఫీసుకు పిలిచి మరీ మారి సెల్వరాజ్, ధ్రువ్‌విక్రమ్‌లను అభినందించారు. బైసన్ చిత్రం గురించి ఎక్స్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ.. మారి సెల్వరాజ్ సినీమకుటంలో ఇది మరో వజ్రం. ప్రతిభను మాత్రమే నమ్ముకున్న ఒక యువకుడు అటు కబడ్డీ కోర్టులో, ఇటు బయట ఎదురైన సమస్యలను ఎదుర్కొని విజయం సాధించిన కథను చాలా గొప్పగా తీర్చిదిద్దారు. క్రీడలు నేపథ్యంగా చేసుకుని ఒక యువకుడు చేరుకోవాల్సిన మార్గాన్ని దర్శకుడు మారి సెల్వరాజ్ చక్కగా చూపించారన్నారు. అద్భుతమైన నటనతో మారి సెల్వరాజ్ కథకి ప్రాణం పోసిన నటుడు ధ్రువ్‌విక్రమ్, పశుపతి, అనుపమ పరమేశ్వరన్, రెజీషా విజయన్.. ఇతర నటీనటులు, తెర వెనుక శ్రమించిన సాంకేతిక వర్గానికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. సీఎం రివ్యూతో పొంగిపోయిన మారి సెల్వరాజ్ ఎక్స్ మీడియా ద్వారా స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# గత మూడేళ్లలో ఒకే సినిమా.. ఇలా అయితే ఎలా?

ఒకప్పుడు అంటే ఎలాంటి కమర్షియల్ సినిమాలు తీసినా సరే ఎలాగోలా హీరోల బండి నడిచేది. కానీ గత కొన్నాళ్లలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రాల్ని చూసేందుకు ప్రేక్షకులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో మిడ్ రేంజ్ హీరోల పరిస్థితి దారుణంగా తయారైంది. దానికి తోడు పలువురు హీరోల మూవీస్ కూడా పెద్దగా వర్కౌట్ కావట్లేదు. అలాంటి వాళ్లలో శర్వానంద్ ఒకడు. ఇంతకీ ప్రస్తుతం ఈ హీరో ఏం చేస్తున్నాడు? కొత్త మూవీస్ సంగతేంటి? గమ్యం, ప్రస్థానం లాంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న శర్వానంద్.. సోలో హీరోగా నిలదొక్కుకోవడానికి బాగానే కష్టపడ్డాడు. కానీ అదృష్టం త్వరగా కలిసి రాలేదు. మంచి నటుడే అని ప్రూవ్ చేసుకున్నప్పటికీ 2014లో 'రన్ రాజా రన్' హిట్ కొట్టి ట్రాక్‌లోకి వచ్చాడు. అలా 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు', ఎక్స్‌ప్రెస్ రాజా, మహానుభావుడు లాంటి సినిమాలతో సక్సెస్ అందుకున్నాడు. కానీ తర్వాత చేసిన రణరంగం, జాను, శ్రీకారం, మహాసముద్రం.. ఇలా ఒకదాన్ని మించి మరొకటి ఫ్లాప్ అయ్యాయి. చివరగా 2022లో 'ఒకే ఒక జీవితం' చిత్రంతో పర్వాలేదనిపించుకున్నాడు. యంగ్ హీరోలు అంటే ఎలా ఉండాలి? పెద్ద హీరోల్లా కాకుండా ఏడాది కనీసం ఒకటి రెండు సినిమాలైనా చేస్తూ ప్రేక్షకుల దృష్టిలో ఉండాలి. లేదంటే ఆడియెన్స్ వీళ్లని మర్చిపోయే అవకాశముంది. అలాంటి శర్వానంద్ నుంచి గత మూడేళ్లలో ఒక్కటే సినిమా వచ్చింది. అది గతేడాది రిలీజైన 'మనమే'. ఇది కూడా



బాక్సాఫీస్ దగ్గర ఘోరంగా ఫ్లాప్ అయింది. ఈ ఏడాది ఏవైనా కొత్త చిత్రాలు తీసుకొస్తాడా అని చూస్తే ప్రస్తుతానికైతే ఆ సూచనలు కనిపించట్లేదు. 2026లో శర్వానంద్ నుంచి ఏకంగా మూడు సినిమాలు థియేటర్లలోకి రాబోతున్నాయి. వాటిలో 'నారీ నారీ నడుమ మురారి' చిత్రం సంక్రాంతిని టార్గెట్ చేశారు. కొన్ని రోజుల క్రితమే పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. కానీ పండకు చిరంజీవి, ప్రభాస్ లాంటి స్టార్ హీరోల మూవీస్ ఉన్నాయి. మరి వాళ్లతో పోటీపడి శర్వా బరిలోకి దిగుతాడా అనేది చూడాలి? మరోవైపు బైకర్ అనే స్పోర్ట్స్ డ్రామా మూవీ, భోగి అనే యాక్షన్ మూవీ కూడా ఈ హీరో చేస్తున్నాడు. వీటితో హిట్ కొట్టి కమ్‌బ్యాక్ అయితే సరేసరి. లేదంటే మాత్రం ప్రస్తుత జనరేషన్‌లో వెనకబడిపోయే ప్రమాదముంది? మరి 2026 అయినా శర్వాకు కలిసొస్తుందేమో చూడాలి?



# దేశంలో తొలిసారి ఏఐ సినిమాలకు పోటీ

యాక్టింగ్, షూటింగ్, మ్యూజిక్, ఎడిటింగ్, వీఎఫ్ఎక్స్, పోస్ట్ ప్రొడక్షన్.. ఇలా అన్నీ ఏఐ చూసుకుంటోంది. అవును, హీరోహీరోయిన్లతో పనే లేకుండా కేవలం ఏఐను వాడుకుని సినిమాలు తీస్తున్నారు. అలాంటి సినిమాలకు ఓ పోటీ కూడా పెట్టారు. అదే ఏఐ హాకథాన్. దేశంలో తొలిసారి ఈ ఏఐ హాకథాన్ జరుగుతోంది. ముంబైలో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2 వరకు ఈ కార్యక్రమం జరగనుంది. ఈ హాకథాన్‌లో 50 మంది క్రియేటర్స్ పాల్గొననున్నారు. వీరు విడివిడిగా లేదా జట్లుగా తయారై ఏఐ టూల్స్ ఉపయోగించి షార్ట్ ఫిలింస్ రూపొందించాల్సి ఉంటుంది. పోటీ చివరిరోజు ఈ సినిమాలను ప్రదర్శించి విజేతలను ప్రకటిస్తారు. విజేతలకు రూ.10 లక్షల ప్రైజ్‌మనీ ఉంటుంది. అమెరికా వంటి దేశాల్లో ఇలాంటి ఏఐ ఈవెంట్స్ తరచూ జరుగుతూ ఉంటాయి.

# స్టార్ హీరోతో డ్యూడ్ హీరోయిన్ మమితా బైజుకు ఛాన్స్



ధనుష్‌తో నటి మమితా బైజుకు జత కుదిరింది. రీసెంట్‌గా డ్యూడ్‌తో ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. మొదట మలయాళం మూవీతో తెరపైకి వచ్చిన ఈ బ్యూటీ తమిళం, తెలుగు అంటూ చుట్టేస్తోంది. ప్రేమలుతో దక్షిణాది చిత్ర పరిశ్రమనే తన వైపు తిప్పకున్న ఈ అమ్మడు కోలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన తొలి చిత్రం రెబెల్ నిరాశపరచడంతో అక్కడ ఈ భామ పప్పులు ఉడకవు అనే విమర్శలను ఎదుర్కొంది. బాలా దర్శకత్వంలో వణంగాన్ చిత్రంలో కొన్ని రోజులు నటించి వైదొలగింది. దీంతో కోలీవుడ్‌లో చిన్న గ్యాప్ కూడా వచ్చింది. అలాంటిది ఇప్పుడు తమిళంలో బిజీ హీరోయిన్ అయిపోయింది. ప్రదీప్ రంగనాథన్‌తో జతకట్టిన ద్విభాషా ( తమిళం, తెలుగు) చిత్రం డ్యూడ్ దీపావళి సందర్భంగా తెరపైకి వచ్చి ప్రేక్షకుల ఆదరణతో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ప్రస్తుతం విజయ్ హీరోగా నటించిన జననాయకన్ చిత్రంలో ఆయనకు చెల్లెలిగా కీలక పాత్రను పోషించింది. ఈచిత్రం వచ్చే ఏడాది జనవరి 9న తెరపైకి రానుంది. తాజాగా సూర్య కథానాయకుడిగా నటిస్తున్న ద్విభాషా చిత్రంలో కథానాయికిగా నటిస్తోంది. అదేవిధంగా ఇరెండు వారమ్ అనే మరో చిత్రంలో నటించిన మమితబైజు మలయాళంలోనూ ఒక చిత్రంలో నటిస్తోంది. కాగా తాజాగా మరో లక్కీచాన్స్ ఈ అమ్మడిని వరించింది. ధనుష్ సరసన నటించడానికి మలయాళీ బ్యూటీ రెడీ అవుతోంది. నటుడు ధనుష్ ప్రస్తుతం తేరే ఇష్క్‌మేన్ అనే హిందీ చిత్రంలో నటిస్తున్నారు. తదుపరి వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి కే. గణేశ్ నిర్మించనున్న చిత్రంలో నటించడానికి సిద్ధం అవుతున్నారు. ఇది ఈయన నటించే 54వ చిత్రం అవుతుంది. దీనికి పోర్ తొళిల్ చిత్రం ఫేమ్ విఘ్నేష్ రాజా దర్శకత్వం వహించనున్నారు. దీనికి జీవీ. ప్రకాష్‌కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. దీని గురించిన అధికారిక పోస్టర్‌ను నిర్మాతల వర్గం విడుదల చేసింది. వచ్చే నెలలోనే ఈ చిత్రం సెట్స్ పైకి వెళ్లనుంది. ఇందులో మమితబైజు నాయకిగా నటించనుందని సినీ వర్గాల సమాచారం.

# రవితేజ-శ్రీలీల మాస్ జాతర.. యాక్షన్ ట్రైలర్ చూశారా?

మాస్ మహారాజా రవితేజ నటిస్తోన్న ఫుల్ యాక్షన్ మూవీ మాస్ జాతర. ఈ మూవీని భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కించారు. ధమాకా లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత శ్రీలీల మరోసారి రవితేజ సరసన కనిపించనుంది. ఈ మూవీ కోసం మాస్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇటీవల రిలీజైన సూపర్ డూపర్ అనే సాంగ్‌ను రిలీజ్ చేయగా అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. రిలీజ్ తేదీ మరో మూడు రోజులే ఉండడంతో ప్రమోషన్స్‌తో దూసుకెళ్తున్నారు మేకర్స్. ఈ నేపథ్యంలోనే మాస్ జాతర ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో రైల్వే పోలీస్ లక్ష్మణ్ భేరి పాత్రలో మాస్ మహారాజా కనిపించనున్నారు. ఈ మూవీలో రవితేజకు ప్రతినాయకుని పాత్రలో నవీన చంద్ర నటించారు. ఈ భారీ యాక్షన్ మూవీని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా అక్టోబరు 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com